PRAMUKHANDHRA 32nd Year of Publication We carry the news and views of Telugus

౩౨ వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15
సెప్టెంబర్ 2026

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA




100% Natural
ZERO SIDE EFFECTS
OVER 100 YEARS OF AUTHENTIC AYURVEDA TRADITION
SINCE 1925
CONTAINS PURE Gold
VK4 DIACON
Patent No.231146
AND ENSURES YOUR TOTAL
E-mail: 1925@vanchintaluru.com www.vanchintaluru.com Consumer Care : 6281452303, 6281457109



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబర్ 2026

సంపుటి : 32 **381** సంచిక : 9




# ఒకే దేశం, ఒకే మతం, ఒకే కులం!

**ఓమ్ యో బ్రహ్మాణం విదధాతిపూర్వం**
**యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।**
**తం హ దేవమాత్మ బుద్ధి ప్రకాశం**
**ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే!**

సృష్టికి పూర్వం సృష్టికర్తయగు బ్రహ్మ నెవరు సృష్టించారో, ఎవరు ఆ బ్రహ్మదేవునికి వేద సంపద నొసగాలో, అట్టి తేజో మూర్తినీ, బుద్ధిని ప్రకాశింపచేయు వాడగు పరమాత్మనూ నేను శరణు వేడుతూంటాను అనే ధ్యాన, అధ్యయన, ఆరాధనా సిద్ధాంతం కలదీ భరతవర్షం భారతదేశం.

**'ఈశావాస్య మిదం జగత్'** అన్నారు. సర్వే సర్వత్రా భగవంతుడున్నాడన్నారు; సచ్చిదానందములో ఉన్నా **దుర్జన సంసర్గం- ఏకాత్మా సర్వభూతాంతరాత్మ** -దుర్జనుల్ను త్యజించు- అన్ని ప్రాణుల్లోనూ ఉన్నారు. అసలు సచ్చిదానందం ఎక్కడున్నది! త్యజ భగవంతుడున్నాడని గ్రహించు. **'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'-** ఇలాటి మధుర సూక్తుల నెన్నిటినో ఇలాతలంలోనికి ప్రవేశపెట్టబడినది, ప్రబోధించినది భారత దేశం, భారతవర్ష పూర్వులే!

దైవం మనుష్య రూపంలో ఉన్నాడంటూ **'దైవం మానుష రూపేణా'** అన్నారు. **సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్'** అన్నారు. పురుషుడైన భగవంతునికి వేల కొద్దీ శిరస్సులూ, వేల కొద్దీ నేత్రములూ, పాదములూ, హస్తములూ ఉన్నాయనడంలో కల భావం భగవంతుడు అందరిలోనూ ఉన్నాడనే అర్థం యిస్తున్నది.

ఆయనకు మతం, కులం, వర్గం భాషా వంటి వ్యత్యాసములు లేవు. భారతదేశంలో ఆరున్నర వేలకు పైగా కులాలూ, ఉపకులాలూ, పదహారు వందలకు పైగా చిన్నచిన్న భాషలు మాట్లాడే ప్రదేశాలూ, 28 రాష్ట్రాలూ 7 కేంద్రపాలిత ప్రాంతాలూ ఉన్నప్పటికినీ ఏకత్వంలో భిన్నత్వంగానూ, భిన్నత్వంలో ఏకత్వంగానూ దేశం విలసిల్లుతూంది, ఏక దేశంగా వరలుతూ వచ్చింది. 'క్షమా ధరిత్రీ అన్నట్టు ఎందరెన్నెన్ని దండయాత్రలు చేసినప్పటికినీ భరతభూమి ఓర్మి వహించింది, వారందర్నీ భారత వాసులుగానే, భారతీయులుగానే, కన్నబిడ్డలు గానే భావించింది. అలాటి భారత దేశంలో జన్మించిన బిడ్డల్ను భారత పౌరులుగా భావించి, భారతదేశ ఔన్నత్యానికి శ్రమించ వలసిన తరుణం వచ్చింది. తరతమ బేధాలను విడనాడి , భారతీయులుగానే ఆచంద్ర తారార్కమూ ఆలుబిడ్డలతో వర్ధిల్లాలి గాని, అంతర్యుద్ధంతో ఒకరి నొకరు హింసించడం సంహరించుకోవడం సమంజసం కాదని ప్రముఖాంధ్ర హితోక్తి పలుకుతోంది. కొత్తతరం వారిలో నైనా, ఒకే దేశం, ఒకే మతం, ఒకే కులం అనే నినాదాన్ని జయధ్వానంగా పలికింప జేయడం మంచిది. భారతి అంటే సరస్వతి. ఆ సరస్వతి జ్ఞాన సరస్వతి. అలాటి భారతి నామకరణం గల భారత దేశంలో సమస్త ప్రాణకోటి సమైక్యతతో జీవించవలసిన తరుణం వచ్చిందని సర్వులూ గ్రహించాలని , సర్వేశ్వరుడు అనుగ్రహించాలని ప్రముఖాంధ్ర కోరుకుంటూంది.



- బుధ జన విధేయుడు
**శ్రీ గోటేటి శ్రీ రామారావు**
జై హింద్, జై భారత్, జై తెలుగు
ప్రముఖాంధ్ర, సెప్టెంబర్, 2002


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




గణితశాస్త్రంలో భారతీయుల ప్రజ్ఞ ఈనాటిది కాదు. గణితశాస్త్రానికి తద్వారా సైన్సు విభాగాలన్నిటికి ప్రాణంగా నిలిచిన అంకె 'సున్న' కనుగొన్న ఘనత భారతీయులదే. వర్గాలు, ఘనాలు, వర్గమూలాలు, ఘనమూలాలు, పై (π) విలువ, సమీకరణాలు, వర్గసమీకరణాలు అనాదికాలం నుంచి భారతీయులకు తెలుసు. ఆనాటి భారతీయ గణిత శాస్త్రజ్ఞుల్లో ఆర్యభట్టు తర్వాత వరాహమిహిరుడు, అతర్వాత భాస్కరాచార్యుడూ.

ఈనాటి భారతీయ గణిత శాస్త్రజ్ఞులలో త్వరగా గుర్తుకువచ్చే పేరు శ్రీనివాస రామానుజం. కేవలం 34 సంవత్సరాలే బ్రతికినా 'ఈ శతాబ్దంలో అందరికంటే గొప్ప గణిత శాస్త్రవేత్త అని హకీ అంతటి మేధావిచేత అనిపించుకున్నవాడు. రామానుజం.

అతడు 1884 డిసెంబరు 22 న తమిళనాడులోని ఈరోడ్లో జన్మించాడు. తండ్రి గుడ్డల కొట్లో గుమాస్తాగా ఉండేవాడు. దారిద్ర్యం తప్ప మరో ఆస్తి లేదు.

చిన్నప్పటినుంచీ రామానుజంలో ఆలోచనలు ఎప్పుడూ పరాయత్తంగా ఉండేవి. ఏదో ఆలోచిస్తూ నిద్రాహారాలు మరచి కూర్చొనేవాడు. కుంభకోణం టౌను హైస్కూలులో చేరినప్పటి నుంచీ అతడు లెక్కలమీద ప్రత్యేకమైన ఆసక్తి కనబరచేవాడు. భాస్కరాచార్యుని శ్లోకాలు క్షణాల్లో వల్లెవేస్తూ చిక్కుప్రశ్నలతో స్నేహితులను విస్మయం చెందించేవాడు. మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు.

12 ఏండ్ల వయసులో పెద్ద తరగతి స్నేహితుడొకడు 'లోనీ' వ్రాసిన Trigonometry పుస్తకం అరువిచ్చాడు. దాన్ని రామానుజం అమూలాగ్రం చదివేశాడు. కొద్దిరోజుల్లోనే అందలి లెక్కలన్నీ నేర్చుకున్నాడు.

మరో మూడేళ్లకు 'కార్' వ్రాసిన 'Synopsis of Pure Mathematics' అనే పుస్తకం సంపాదించాడు. అందులో ఇవ్వబడిన సిద్ధాంతాలకు ఉపపత్తులను ఆలోచించేవాడు. అతని మీద ఎక్కువగా ప్రభావం చూపినదీ పుస్తకమే.

రామానుజం నిద్రపోతూ కూడా ఆలోచించేవాడట. చిన్నప్పుడేగాక పెద్దయిన తర్వాత కూడా నిద్రలో ఆలోచించినవన్నీ నిద్ర లేచిన పిదప నోటుపుస్తకంలో వ్రాసుకొనేవాడట! తన ఈ శక్తికి తన కులదేవతయే కారణమని అతడనేవాడు. మెట్రిక్యులేషన్ అనంతరం అతడు కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరాడు. ఎప్పుడూ గణితం గురించే ఆలోచిస్తూ మిగతా సబ్జక్టు నిర్లక్ష్యం చేయడంవల్ల అతడు ఎఫ్.ఏ. తప్పాడు. 1909 లో వివాహం జరిగింది. దారిద్ర్య బాధవల్ల ఉద్యోగాన్వేషణ ప్రారంభించాడు. మద్రాసు పోర్టు ట్రస్టులో గుమస్తాగా ప్రవేశించాడు.

ఆర్థిక పరిస్థితి మెరుగైనందున అతడు మరల గణిత పరిశోధనల్లో పడ్డాడు. 1911 లో అతని మొదటి వ్యాసం Journal of the Indian Mathematical Society లో ప్రచురింప బడింది. అపుడతని వయస్సు 23 సంవత్సరాలే. కానీ అతని వ్యాసాల్లో చాలా భాగం గణిత శాస్త్రజ్ఞులకు అంతుబట్టేవికావు. అందుచేత అతనికా వ్యాసాలవల్ల పెద్దగా పేరు రాలేదు.

మద్రాసులో ప్రొఫెసర్ శేషు అయ్యర్ అనేవారి ప్రోత్సాహంతో రామానుజం కేంబ్రిడ్జిలోని ట్రినిటీ కాలేజీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ హార్డీతో కలం పరిచయం చేసుకున్నాడు. తన మొదటి ఉత్తరంలోనే 120 సిద్ధాంతాలు పంపాడు. ఆ సిద్ధాంతాలు చూడగానే రామానుజం గొప్పతనాన్ని గ్రహించాడు హార్డీ.

ఈలోగా రామానుజం ప్రజ్ఞ మద్రాసు పోర్ట్ ట్రస్టు అధ్యక్షునికి కూడ తెలిసింది. ఆయన ఆశ్చర్యపడి, చాలా సంతోషించి, మద్రాసు విశ్వవిద్యాలయంవారిని ఒప్పించి పట్టుబట్టి సీటు, స్కాలర్షిప్పు ఇప్పించి, ఉద్యోగానికి సెలవు పెట్టించాడు. 1918 మే నెలలో రామానుజం మద్రాసు విశ్వవిద్యాలయంలో చేరాడు. కేంబ్రిడ్జి నుంచి ప్రొఫెసర్ హార్డీ కూడా ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాసి రామానుజం ఇంగ్లండు వచ్చే ఏర్పాటు చేశాడు.

రామానుజంకు లెక్కల్లో తెలివితేటలున్నాయి గాని నూతన పద్ధతులూ, పరిశోధనలూ అంతగా తెలియవు. కొన్నాళ్లు ప్రొఫెసర్ హార్డీ అతనికి లెక్కలలో క్రొత్త పద్ధతులు నేర్పాడు. అప్పట్లో హార్డీ ఇలా వ్రాశాడు: 'ఈ యువ రామానుజం ఎంత కష్టమైన లెక్కలైనా కనీవినీ ఎరుగనంత నేర్పుగా చేస్తాడు. భిన్నాలను పొడిగించే పద్ధతిలో ఈయనను మించినవారు ప్రపంచంలో లేరు. సంఖ్యా సిద్ధాంతం (Theory of Numbers) లో అతికష్టమైనవి అనిపించుకున్న సూత్రాలను ఈయన స్వయంగా నేర్చుకున్నాడు. కానీ ఈయన సమస్యల్ని సాధించే పద్ధతి వింతగా ఉంటుంది. హేతువాదం, సహజ పాండిత్యం, ప్రయోగం... ఇవన్నీ కలిసిన మొరటు పద్ధతి. తన పద్ధతిని వివరించి చెప్పడం అతనికే చేతనయ్యేది కాదు.

## ఔన్నత్యం వెనుక దీక్ష



ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడైన శ్రీనివాస రామానుజం ఒకసారి ఏదో ఆలోచిస్తూ రోడ్డు మీద నడిచిపోతున్నాడు. ఎదురుగా వస్తున్న ఆయన స్నేహితుడు రామానుజంను కలిసి 'రామానుజం! అందరూ నిన్ను అసామాన్య ప్రతిభావంతుడుగా చెప్తున్నారు. ఇంతటి అవతారపురుషుడిగా ఎప్పుడు తయారయ్యావు?' అని ప్రశ్నించాడు. రామానుజానికి ఆశ్చర్యం కలిగింది. దానికేం సమాధానం చెప్పాలో తెలియలేదు. 'నేనేమిటి? అవతార పురుషుడేమిటి? అయినా నా అరచేతులొకసారి చూడు. అవి నేనేమిటో చెప్తాయి' అని రామానుజం అన్నాడు. ఆయన రామానుజం చేతులు కాయలు కాచి ఉండటం చూసి 'అరే! ఇంతలా కాయలు...' అనడంతో 'అదీ అసలు సంగతి. నన్ను మహాపురుషునిగా తయారుచేసింది. ఇవే. పలకమీద లెక్కలు చేస్తూ, చెరపడానికి పాతగుడ్డలు లేక నా చేతులు ఉపయోగించే వాడిని' అని రామానుజం సమాధానం చెప్పాడు. – జిష్ణు

ఇతనికి నేను చెప్పినదానికన్న నేనే ఇతని దగ్గర ఎంతో నేర్చుకున్నాను.'

గణితశాస్త్రానికి రామానుజం చేసిన సేవలో మొదట చెప్పవలసినది అతడు హార్డీతో కలసి కనుగొన్న సిద్ధాంతం. ఒక్కొక్క సంఖ్యను రెండు సంఖ్యల మొత్తంగా చెప్పడానికి ఎన్ని పద్ధతులున్నాయో ఈ సిద్ధాంతంవల్ల నిర్ణయించవచ్చు. రామానుజానికి మొదటి 10,000 అంకెలూ ప్రాణస్నేహితులట! వాటి రహస్యాలన్నీ ఆయన నోటికి వచ్చు.

ఒకసారి రామానుజం జ్వరం వచ్చి పడుకున్నాడు. ప్రొఫెసర్ హార్డీ చూచిపోదామని వచ్చాడు. రామానుజం యొక్క ఆరోగ్యం గురించి పరామర్శించాడు. రామానుజం సమాధానం హార్డీకి తృప్తినివ్వలేదు. అప్పుడు హార్డీ 'నేను 1729 నెంబరు టాక్సీలో వచ్చాను. ఆ సంఖ్య అంత మంచిది కాదు' అన్నాడు. రామానుజం వెంటనే 'కాదండి, అది మంచి సంఖ్య. దానిని రెండు ఘనముల మొత్తంగా, రెండు విధాలుగా చెప్పవచ్చు. ఎట్లనగా $1729 = 10^3+9^3$ లేదా $12^3+1^3$" అన్నాడు. హార్డీ సంతోషపడ్డాడు.

ఇంగ్లండులో ఉండగా రామానుజానికి క్షయవ్యాధి వచ్చింది. 1917 లో ఆయన రాయల్ సొసైటీ సభ్యుడు (F.R.S.) గా స్వీకరించబడ్డాడు. ఈ గౌరవాన్ని పొంది  న భారతీయుల్లో ఇతడు ద్వితీయుడు. 1918 లోనే ట్రినిటీ కాలేజి ఫెలోగా కూడ ఎన్నుకోబడ్డాడు. 'ఆ సంస్థలే అతన్ని గౌరవించే అవకాశం చేయిజారకుండా కాపాడుకున్నాయి' అంటాడు హార్డీ.

1919 లో మొదట్లో భారతదేశానికతడు వచ్చాడు. కానీ ఆరోగ్యం మరింత క్షీణించింది. 1920 లో కన్నుమూశాడు.

'మహాగణితశాస్త్రజ్ఞులు' అనే గ్రంథంలో హెర్బర్ట్ టర్న్ బుల్ అను పాశ్చాత్య రచయిత శ్రీనివాస రామానుజం గురించి ఇలా పేర్కొన్నాడు '19వ శతాబ్ది చివరలో ఎవరైనా మహావ్యక్తి ఉద్భవించి, సుదీర్ఘమైన గణితశాస్త్ర వివరాలన్నిటినీ క్లుప్తీకరించి సిద్ధాంతాలలోకి కుదించ వలసిన అవసరం ఎంతైనా కనిపించింది. ఈ పని చేయగల మహామేధావి భారతదేశంలో ఉద్భవించాడు. రామానుజంతో ఒక క్రొత్త యుగం ఆరంభమైనది. అనాది నుంచీ భారత దేశంలో మహాగణితశాస్త్రజ్ఞులు ఎందరో ఉద్భవించారు. కానీ కేవలం మేధస్సునే దృష్టి యందుంచుకొని పరిశీలిస్తే, ప్రాగ్గణిత శాస్త్రజ్ఞులలో రామానుజంను మించగలవారు లేరు.'

– సౌమిత్రి




## శ్రీ శ్రీ త్యాగరాజ సంగీత సభాభవన ప్రారంభోత్సవం

రామచంద్రపురం పట్టణంలో దాత లు, ప్రభుత్వం చేయూతతో సుమారు రెండు కోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించుకున్న శ్రీ త్యాగరాజ సంగీత సభాభవనం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రపురం పట్టణంలో సంగీత సాహిత్యాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 1980 ఏప్రిల్ లో పలువురు సంగీత అభిమానులు సభ్యులుగా శ్రీ త్యాగరాజు సంగీత సభ స్థాపించబడిందని, 1985 డిసెంబర్ 25న పలువురు దాతల ఔదార్యంతో నాడు నిర్మించుకున్న సొంత భవనాన్ని పద్మశ్రీ, పద్మభూషణ్ దివంగత డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ అమృత హస్తాలతో ప్రారంభించడం ఒక విశేషం అయితే, ఈ భవనం ఉన్న ప్రాంతానికి "త్యాగరాజ నగర్" అని పేరు పెట్టడం శ్రీ త్యాగరాజ సంగీత సభ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టి పూర్వం వైభవం తేవాలని సంకల్పించి సుమారు కోటి 90 లక్షల అంచనా వ్యయంతో పట్టణానికి చెందిన ప్రముఖ అర్కిటెక్ట్ బీఎస్ మూర్తిచే అన్ని అంగులతో కూడిన అత్యంత ప్రతిష్టాత్మకంగా శ్రీ త్యాగరాజు సంగీత సభా భవనం నిర్మాణానికి రూపకల్పం చేసి ప్రారంభించామని, దీంతో ఇక్కడ ఈ భవన నిర్మాణానికి సంగీత ప్రియులు, వారి వారసులు భారీ విరాళాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మరో 120 మంది దాతలు ఈ భవన నిర్మాణానికి సహకరించారని శ్రీనివాసు తెలియజేశారు. ప్రస్తుతం శ్రీ త్యాగరాజు సంగీత సభ ట్రస్ట్ చైర్మన్గా శిష్టా అమ్మన్నపంతులు, జాయింట్ మేనేజింగ్ ట్రస్ట్ సెక్రటరీగా తట్టవర్తి శ్రీనివాసులతో పాటు మరో 12 మంది సభ్యులతో కొనసాగుతున్నట్లు శ్రీనివాసు తెలియజేశారు. ❑

SRI RAJARAJESWARI
JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

తెలుగు తేజాలు



# డా. బూర్గుల రామకృష్ణారావు

**డా.** బూర్గుల రామకృష్ణారావు (13 మార్చి 1899 -- 14 సెప్టెంబర్ 1967) తెలంగాణలోని కల్వకుర్తి సమీపంలోని పడకల్ గ్రామంలో శ్రీ నర్సింగరావు, శ్రీమతి రంగనాయకమ్మ దంపతులకు తెలుగు బ్రాహ్మణ (గోల్కొండ వ్యాపారి) కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు ఇంటిపేరు పుల్లంరాజు. వారి పూర్వీకుల గ్రామం పేరు "బూర్గుల" అవటంతోఅదే ఆయన ఇంటిపేరుగా వాడుకలోకి వచ్చింది.

**విద్యాభ్యాసం మరియు న్యాయవృత్తి**

బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అనంతరం పుణెలోని ఫెర్గుసన్ కళాశాల నుండి బి.ఏ. (ఆనర్స్) పట్టా, 1923లో బొంబాయి విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో (ఎల్.ఎల్.బి.) పట్టా పొందారు. ఎల్.ఎల్.బి. పూర్తిచేసిన అనంతరం 1923--24లో హైదరాబాద్‌లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించారు. దాదాపు పదిహేనేళ్ల పాటు రాజ్యాంగ సంబంధిత న్యాయవ్యవహారాల్లో విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించి, రాజకీయ కార్యకర్తలు మరియు స్వాతంత్ర్య సమరయోధుల తరఫున అనేక కీలక కేసుల్లో వాదించి, హైదరాబాద్‌లోని ప్రముఖ రాజ్యాంగ న్యాయవాదులలో ఒకరిగా గుర్తింపు పొందారు.

**స్వాతంత్ర్య సమరంలో పాత్ర**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో బూర్గుల రామకృష్ణారావు చురుకైన పాత్ర పోషించారు. ఆయన హైదరాబాద్ సోషల్ కాన్ఫరెన్స్ కార్యదర్శిగా, హైదరాబాద్ రిఫార్మ్ కమిటీ సభ్యునిగా, అలాగే తెలుగు భాషా--సంస్కృతి పరిరక్షణతో పాటు క్రమబద్ధమైన రాజకీయ సంస్కరణలను సమర్థించిన ఆంధ్ర మహాసభలో క్రియాశీల సభ్యునిగా సేవలందించారు. 1931 మార్చి లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన నిజాం ఆంధ్ర మహాసభ రెండవ మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ మహాసభలో భారతదేశ సమైక్యతకు భంగం కలగకుండా ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈ వేదిక ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన రావి నారాయణరెడ్డి వంటి నాయకులతో కలిసి ప్రజలకు జవాబుదారీతనం కలిగిన ప్రభుత్వాన్ని సాధించేందుకు ప్రజలను సమీకరించారు. స్థానిక భాషలో విద్యను ప్రోత్సహించడం, అన్యాయమైన పన్నులు మరియు లెవీలకు వ్యతిరేకంగా వ్యాపారులను సంఘటితం చేయడం వంటి కార్యక్రమాలకు బూర్గుల రామకృష్ణారావు కృషి చేశారు.

భారత జాతీయ కాంగ్రెస్ ఆదర్శాల స్ఫూర్తితో గోవిందరావు నానల్, బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు తదితర ప్రముఖుల కృషి ఫలితంగా 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. అదే సంవత్సరం స్వామి రామానంద తీర్థ ఉద్యమంలో చేరి, త్వరలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌కు ప్రధాన నాయకుడిగా ఎదిగి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా బూర్గుల రామకృష్ణారావు చురుకుగా పాల్గొనడంతో, నిజాం ప్రభుత్వ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.

**నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం -- ప్రజాస్వామ్య ఆదర్శాల పరిరక్షణ**

బూర్గుల రామకృష్ణారావు నిజాం పాలనలో నెలకొన్న భూస్వామ్య (జాగీర్దారీ) వ్యవస్థ, జాగీర్దార్ల ప్రత్యేక హక్కులు, కేంద్రీకృత నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య సంస్కరణలను బలంగా సమర్థించారు. అప్పటి భూస్వామ్య వ్యవస్థలో వెట్టిచాకిరి వంటి దోపిడీ పద్ధతుల ద్వారా రైతుల పంటలో 50 నుండి 75 శాతం వరకు కౌలు, పన్నులు మరియు ఇతర లెవీల రూపంలో వసూలు చేయబడేది. దీనివల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, గ్రామీణ ప్రాంతాల్లో అసంతృప్తి మరియు తిరుగుబాట్లు పెరిగాయి. 1947లో "జాయిన్ ఇండియా ఉద్యమం" సందర్భంగా నిజాం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి బూర్గుల రామకృష్ణారావు ప్రజా నిరసనలకు నాయకత్వం వహించారు. భారత జాతీయ త్రివర్ణ పతాకాన్ని బహిరంగంగా ఎగురవేసి, హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా కొనసాగించాలన్న నిజాం ప్రయత్నాలను వ్యతిరేకించారు.

1948 ప్రారంభంలో బూర్గుల రామకృష్ణారావు, భారత ప్రభుత్వ ప్రతినిధిగా హైదరాబాద్‌లో నియమితులైన కె. ఎం. మున్షీని రహస్యంగా కలుసుకుని హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేయడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలకు మద్దతు తెలుపారు. 1948 సెప్టెంబర్ 13 నుండి 17 వరకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం చేయబడింది. నిజాం స్వతంత్ర రాజ్యంగా కొనసాగాలన్న ప్రయత్నాలకు ముగింపు పలికిన ఈ చర్య ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో బూర్గుల రామకృష్ణారావు నిరంకుశ, భూస్వామ్య ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా లౌకిక, ప్రజాస్వామ్య, ఎన్నికల ద్వారా ఏర్పడే ప్రభుత్వానికి కట్టుబడి ఉన్న నాయకుడిగా నిలిచారు. 1948 సెప్టెంబర్ నుండి 1949 డిసెంబర్ వరకు జె. ఎన్. చతుర్వేది సైనిక గవర్నర్‌గా వ్యవహరిస్తూ శాంతి భద్రతలను పునరుద్ధరించి, పరిపాలనా మార్పిడిని పర్యవేక్షించారు. అనంతరం 1949 డిసెంబర్ నుండి 1952 మార్చి వరకు ఎం. కె. వెల్లోడి భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాష్ట్ర తొలి పౌర పరిపాలనకు నాయకత్వం వహించారు. ఈ కాలంలో బూర్గుల రామకృష్ణారావు వెల్లోడి మంత్రివర్గంలో మంత్రిగా రెవెన్యూ, విద్య తదితర కీలక శాఖలకు బాధ్యత వహిస్తూ, పరిపాలనా సంస్కరణలు మరియు భూసంస్కరణల అమలులో విశిష్ట పాత్ర పోషించారు. 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికై, 1952 మార్చి 6న హైదరాబాద్ రాష్ట్ర తొలి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

**ముఖ్య విజయాలు**

1. **భూసంస్కరణలకు శ్రీకారం:** బూర్గుల రామకృష్ణారావు కృషి కౌలుదారుల హక్కులు బలోపేతం చేసే హైదరాబాద్ టెనెన్సీ అండ్ అగ్రికల్చరల్ ల్యాండ్స్ చట్టం మరియు 1954లో దానికి చేసిన సవరణలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయి. స్వతంత్ర భారతదేశంలో అమలైన తొలి, అత్యంత ప్రభావవంతమైన భూసంస్కరణలలో ఇవి ఒకటిగా పరిగణించబడుతున్నాయి.

2. **భూస్వామ్య వ్యవస్థ నిర్మూలన:** బూర్గుల ప్రభుత్వం నిజాం పాలన నుండి సంక్రమించిన జాగీర్దారీ, మక్తేదారీ వ్యవస్థలను రద్దు చేసింది. దీనివల్ల భూస్వాముల ప్రత్యేక హక్కులు బలహీనపడి, విస్తారమైన భూములు ప్రభుత్వ ప్రత్యక్ష పరిపాలనలోకి వచ్చాయి.

3. **భూదాన ఉద్యమానికి ప్రోత్సాహం:** బూర్గుల ముఖ్యమంత్రి పదవీకాలంలోనే ఆచార్య వినోబా భావే తెలంగాణలో (1951--52) భూదాన ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమానికి బూర్గుల ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడంతో, హైదరాబాద్ రాష్ట్రంలో అది వేగంగా విస్తరించింది.

4. **వెనుకబడిన వర్గాల సంక్షేమం:** షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), వెనుకబడిన తరగతుల (బీసీలు) విద్యా, సామాజిక అభివృద్ధి కోసం బూర్గుల ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. విద్యావకాశాలను విస్తరించడం, సంక్షేమ పథకాలను బలోపేతం చేయడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చింది.

5. **పరిపాలనా స్థిరీకరణ:** 1948 పోలీసు చర్య అనంతరం ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితుల నుండి ప్రజాపరిపాలనను గాడిలో పెట్టడంలో బూర్గుల ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పునరుద్ధరించడంతో పాటు ప్రజాస్వామ్య సంస్థలు, శాసన ప్రక్రియలు మరియు పౌర పరిపాలనను బలోపేతం చేసింది.

6. **తెలుగు భాష గుర్తింపుకు ప్రోత్సాహం:** బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగును విద్యా బోధనా మాధ్యమంగా, పరిపాలనా భాషగా ప్రోత్సహించింది. అదే సమయంలో ఉర్దూ మరియు ఇతర ప్రాంతీయ భాషలకు తగిన గౌరవాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర బహుభాషా స్వరూపాన్ని సమతుల్యంగా నిర్వహించింది. 1952 నుండి అమలులోకి వచ్చిన ఈ విధానం తెలుగు మాట్లాడే ప్రజలలో ఉమ్మడి భాషా, సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసింది. 1956 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలుగు మాట్లాడే ప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడేందుకు ఈ విధానం బలమైన పునాదిగా నిలిచిందని సమైక్యవాదులు ప్రశంసించారు.

**1952 ముల్కీ ఉద్యమం**

నేపథ్యం : 1919లో నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముల్కీ నిబంధనల ప్రకారం, హైదరాబాద్ రాష్ట్రంలో స్థిర నివాసం కలిగిన "ముల్కీలకు" ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండేది. 1948లో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం అయిన తరువాత, ముందుగా సైనిక గవర్నర్ పాలనలో, అనంతరం ఎం. కె. వెల్లోడి నేతృత్వంలోని పౌర పరిపాలనలో అనుభవజ్ఞులైన స్థానిక అధికారుల కొరత కారణంగా అప్పటి మద్రాస్, బొంబాయి రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో అధికారులను నియమించారు. ఈ నియామకాలు ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, స్థానికుల ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయని తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

**ఉద్యమం :** 1952 మార్చిలో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, స్థానిక సంస్థలు కలిసి ముల్కీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, వాటిని ఉల్లంఘించి నియమించబడిన స్థానికేతర ఉద్యోగులను తొలగించాలని, స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలలో అధిక అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ ఉద్యమం మొదట వరంగల్‌లో ఉపాధ్యాయుల బదిలీల అంశంపై ప్రారంభమై, త్వరలోనే హైదరాబాద్‌కు విస్తరించింది. సిటీ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ భారీ ప్రదర్శనలు నిర్వహించారు. 1952 సెప్టెంబరులో సిటీ కళాశాల సమీపంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు విద్యార్థులు మరణించగా, మరెందరో గాయపడ్డారు. ఈ సంఘటన ముల్కీ ఉద్యమంలో అత్యంత విషాదకరమైన మరియు కీలకమైన ఘట్టంగా చరిత్రలో నిలిచింది.

**ప్రభుత్వ స్పందన :** ఉద్యమ పరిస్థితులను సమీక్షించేందుకు బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం కె. వి. రంగారెడ్డి అధ్యక్షతన ఒక కమిటీని నియమించి, ముల్కీ నిబంధనల అమలు పరిస్థితులను పరిశీలించింది. అదేవిధంగా, విద్యార్థులపై జరిగిన పోలీసు కాల్పులు మరియు వాటికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపేందుకు న్యాయమూర్తి పింగళి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మరో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ చర్యలతో ఉద్యమం క్రమంగా శాంతించినప్పటికీ, స్థానికుల ఉద్యోగ రక్షణ, ఉపాధి అవకాశాల విషయంలో ప్రజల్లో ఉన్న అసంతృప్తి పూర్తిగా తొలగిపోలేదు.

**హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం**

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే జిల్లాలను ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. అయితే, తెలంగాణ ప్రాంతంలోని అనేక మంది నాయకులు ఈ ప్రతిపాదనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రాంతం అప్పటికే విద్య, పరిపాలన, ఆర్థికాభివృద్ధి పరంగా ముందంజలో ఉండటంతో, విలీనం జరిగితే తెలంగాణ వనరులు, ప్రభుత్వ ఉద్యోగాలు, సాగునీటి హక్కులు ఆంధ్ర ప్రాంత ఆధిపత్యంలోకి వెళ్లిపోతాయనే భయం తెలంగాణ ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ (ఎస్.ఆర్.సి.) అధ్యక్షుడు ఫజల్ అలీ నేతృత్వంలోని కమిషన్ తెలంగాణను తాత్కాలికంగా ప్రత్యేక రాష్ట్రంగానే కొనసాగించాలని సిఫారసు చేసింది. అయితే, భవిష్యత్తులో తెలంగాణ శాసనసభ సభ్యులలో మూడింట రెండొంతుల మెజారిటీ అంగీకరిస్తే విలీనం చేపట్టవచ్చని కూడా సూచించింది. కానీ తదనంతర రాజకీయ చర్చల ఫలితంగా కేంద్ర మరియు ప్రాంతీయ నాయకత్వం తక్షణ విలీనానికే మొగ్గుచూపింది. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడే సందర్భంలో తెలంగాణ ప్రాంత ఆర్థిక, విద్యా, ఉపాధి మరియు పరిపాలనా ప్రయోజనాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో "జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్" రూపొందించారు. ఇది రాజ్యాంగంలో పొందుపరచబడిన చట్టబద్ధమైన ఒప్పందం కాకుండా, పరస్పర విశ్వాసం మరియు రాజకీయ నిబద్ధత ఆధారంగా అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంత నాయకులు మరియు ఆంధ్ర రాష్ట్ర నాయకుల మధ్య జరిగిన రాజకీయ అవగాహన కుదిరిన ఒప్పందం కావడంతో దీనికి "జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్" అనే పేరు వచ్చింది

బూర్గుల రామకృష్ణారావు వ్యక్తిగతంగా తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంతో వెంటనే విలీనం చేయాలనే ప్రతిపాదనకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల్లో అధికశాతం మంది ప్రత్యేక రాష్ట్రాన్ని కొనసాగించాలనే అభిప్రాయంతో ఉన్నారని, అలా చేయడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఆంధ్ర ప్రాంత ఆధిపత్యం నుండి తెలంగాణ ప్రయోజనాలను రక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల

పునర్వ్యవస్థీకరణ కమిషన్ కూడా ఇదే దిశగా సూచనలు చేసినప్పటికీ, కేంద్ర నాయకత్వం తీసుకున్న రాజకీయ నిర్ణయం మేరకు విలీనం అమలులోకి వచ్చింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బూర్గుల రామకృష్ణారావు వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు సహకరించారు. ఆయన ప్రదర్శించిన ఈ రాజకీయ నిస్వార్థతను సమకాలీన ప్రముఖులు, ముఖ్యంగా కె. ఎం. మున్షీ విశేషంగా ప్రశంసించారు.

**గవర్నర్‌గా సేవలు**

1956 నవంబర్ 1న రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం భాషాప్రాతిపదికన కేరళ రాష్ట్రం ఏర్పడిన అనంతరం, బూర్గుల రామకృష్ణారావు 1956 నవంబర్ 22న ఆ రాష్ట్ర తొలి గవర్నర్‌గా నియమితులయ్యారు. 1960 జూలై నుండి 1962 ఏప్రిల్ వరకు ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా సేవలందించారు. అనంతరం 1962 నుండి 1966 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ భారత పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు.

**సాహిత్యం, సంస్కృతి మరియు విద్యా సేవలు**

బూర్గుల రామకృష్ణారావు సేవలు రాజకీయ రంగానికే పరిమితం కాలేదు. సామాజిక సేవ, సాహిత్యం, సంస్కృతి, విద్యా రంగాల్లో కూడా ఆయన విశేష కృషి చేశారు. ఆయన ఖాదీ బోర్డు విచారణ కమిటీ, మధ్యప్రదేశ్ స్టడీ కమిటీ, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక్ సమాజ్లకు అధ్యక్షుడిగా సేవలందించారు. అలాగే తెలుగు అకాడమీ, ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్లకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ సాహిత్య, సాంస్కృతిక వికాసానికి విశేషంగా తోడ్పడ్డారు. అదేవిధంగా ప్రాచీన (శాస్త్రీయ) భాషల కమిషన్ సభ్యునిగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఉపాధ్యక్షునిగా, సంస్కృత పరిషత్ ఉపాధ్యక్షునిగా భారతీయ భాషల అభివృద్ధికి కృషి చేశారు.

అసాధారణ భాషా పాండిత్యాన్ని సంపాదించిన బూర్గుల రామకృష్ణారావు తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పర్షియన్, సంస్కృత భాషలలో ప్రవీణులు. మహారాష్ట్రలో విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సోనెట్లు, వ్యాసాలు రచించారు. వాటిలో అనేక రచనలు కళాశాల పత్రికలో ప్రచురించబడ్డాయి. ఆంగ్ల కవి థామస్ గ్రే రచించిన Elegy Written in a Country Churchyardను "మృత సంస్కృతి" అనే పేరుతో తెలుగులో అనువదించారు. ఆ అనువాదం అనువాద రచనగా కాకుండా స్వతంత్ర సృజనగా భావించేంత స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఆయన స్వీయ ఆంగ్ల కవితలు The Dream of Poetries and Other Poems అనే సంపుటిగా వెలువడ్డాయి. ఆయన అత్యంత ప్రసిద్ధ పరిశోధనా గ్రంథాలలో History of Persian Literature ఒకటి. జగన్నాథ పండితరాజు రచించిన లహరి పంచకంను పండిత పంచామృతంగా, ఆదిశంకరాచార్యుల సౌందర్యలహరి, కనకధారా స్తవంలను తెలుగులోకి అనువదించారు. ఆయన ఇతర ముఖ్య రచనలు– కృష్ణ శతకం, శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం (సంస్కృతం), శారదా స్తుతి, గౌరీ స్తుతి, వాణీ స్తుతి, లక్ష్మీ స్తుతి, శ్రీ కృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలంలోని మతం మరియు సంస్కృతి (Religion and Culture during the Period of the Reddy Kings). ఆయన వ్యాసాలు సారస్వత వ్యాస ముక్తావళి పేరుతో ప్రచురించబడ్డాయి. అదనంగా నర్మద గీతాలు, పుష్పాంజలి, కర్మ కంకణం, తొలి చుక్క, నివేదన వంటి కవితా సంపుటాలను కూడా రచించారు. అనేక గ్రంథాలకు పీఠికలు రాయడమే కాకుండా పలు అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్యులు, సి. నారాయణరెడ్డి వంటి ప్రముఖ సాహితీవేత్తల ప్రోత్సాహంతో తెలంగాణ రచయితల సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించి సాహిత్య రంగంలో విశేష గౌరవాన్ని పొందారు.

ప్రజా జీవితం, సాహిత్యం, విద్యారంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం 1953లో జరిగిన రజతోత్సవ పట్టాభిషేక మహాసభలో గౌరవ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డి.లిట్.) బిరుదును ప్రదానం చేసింది. అనంతరం 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టర్ ఆఫ్ లాస్ (ఎల్.ఎల్.డి.) బిరుదును ప్రదానం చేసి సత్కరించింది.

**పి. వి. నరసింహారావుపై బూర్గుల ప్రభావం**

భారత మాజీ ప్రధానమంత్రి పి. వి. నరసింహారావు ప్రారంభ రాజకీయ జీవితంలోని ప్రముఖ మార్గదర్శకులలో బూర్గుల రామకృష్ణారావు ఒకరు. ఇద్దరూ హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో కలిసి పనిచేశారు. 1952––1956 మధ్య బూర్గుల మంత్రివర్గంలో పి. వి. నరసింహారావు న్యాయశాఖ మరియు సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రజాస్వామ్య పరిపాలన, రాజ్యాంగబద్ధ రాజకీయాలు, భూసంస్కరణల పట్ల బూర్గుల రామకృష్ణారావు కలిగిన నిబద్ధత, పి. వి. నరసింహారావు పరిపాలనా దృక్పథం మరియు రాజకీయ తత్వంపై గణనీయమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపింది.

**కుటుంబం**

డా. బూర్గుల రామకృష్ణారావు మొదట రాధాబాయిని వివాహం చేసుకున్నారు. ఆమె మరణానంతరం అనంతలక్ష్మీ దేవిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు –– బూర్గుల రంగనాథరావు, బూర్గుల లక్ష్మీనారాయణరావు, ఇద్దరు కుమార్తెలు –– శ్యామలాదేవి, ఇందిర. డా. బూర్గుల రామకృష్ణారావు 1967 సెప్టెంబర్ 14న హైదరాబాద్‌లో 68 సంవత్సరాల వయస్సులో పరమపదించారు.

**శతజయంతి వేడుకలు మరియు స్మారక చిహ్నాలు**

డా. బూర్గుల రామకృష్ణారావు జన్మ శతాబ్ది ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో 1999 మార్చి 13 నుండి 2000 మార్చి 13 వరకు ఘనంగా నిర్వహించింది. 2000 మార్చి 13న భారత ప్రభుత్వ తపాలా శాఖ డా. బూర్గుల రామకృష్ణారావు స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది. 1999 ఆగస్టు 31న, అప్పటి భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డా. బూర్గుల రామకృష్ణారావు జీవిత చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన సేవలకు గుర్తింపుగా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదేవిధంగా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్.టి. రామారావు) హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి "బి.ఆర్.కె.ఆర్. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం" (BRKR Government Offices Complex) అనే పేరును నామకరణం చేశారు. హైదరాబాద్‌లోని ఎస్.ఆర్. నగర్‌లో ఉన్న అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఆయుర్వేద విద్యకు ప్రముఖ విద్యాసంస్థగా పేరుపొందిన ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలకు బూర్గుల వారి స్మారకార్థం "డా. బి.ఆర్.కె.ఆర్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల" అని పేరు పెట్టారు.

డాక్టర్. బీ. యన్. వీ. పార్థసారధి ❑



# కృష్ణుడంటే?........



**కృ**ష్ణుడు అన్న పేరు వినగానే మొదట మనకు కనిపించేది చిలిపితనం. కృష్ణా అని నోరారా ఆర్తితో పిలిచినపుడు మనం చవి చూచేది వాత్సల్యం. కన్నయ్యా అని తలచినపుడు మనం అనుభవించేది మాతృప్రేమ. మాధవా అన్నప్పుడు

మనని ఆలింగనం చేసుకునేది మధురభక్తి. వాసుదేవా అని దగ్గరకు చేరితే చేకూరేది సఖ్యత. నందనందనా అన్నప్పుడు లభించేది మూగజీవులైన అపార గోగణం మీద చూపే ప్రేమ. ద్రౌపదికి వలువలిచ్చి కౌరవసభలో ఆ ఇల్లాలి మానసంరక్షణ చేయడం, ఆ పాండవ ప్రియసఖుడి ఆర్తజనరక్షణ. పిడికెడటుకులతో కుచేలునికి సకల భోగభాగ్యాలు ప్రసాదించడం ఆ చెలికాని చిన్ననాటి మైత్రీ విలువలకు ప్రతీక. మూర్ఖుడైన శిశుపాలుని పట్ల వహించిన ఉదాసీనత మధుసూదనుని అనంత ఓరిమికి నిదర్శనం. సదా తననే భర్తగా ఊహిస్తూ ఆరాధించిన పడతిని కరగ్రహణంచేసి రుక్మి శిశుపాలాదులను వెరపుమరిచి ఎదిరించి అరదంపై ఎక్కించుకుని వెళ్ళడం రుక్మిణీవల్లభుని ధైర్యగుణ దర్పణం. జగద్గురువై భాసిల్లినా తొలుత విద్యార్జనకై సాందీపునికి గురుశుశ్రూష చేయడం జనార్ధనుని వినయ సంపదకు చిహ్నం. తనను సంపూర్ణంగా విశ్వశించిన పార్ధునికి కదనరంగంలో గాంగేయుని బాణగరిమతో ఆపద ఏర్పడినప్పుడు కుపితుడై కర్ణకుండలద్వయపు కాంతులు ఆకసాన విరజిమ్ముతూ, కడుపులో దాచిన జగత్తు కంపించి పోతుండగా చక్రధరుడై భుజంనుంచి పచ్చని కండువా జారిపోతున్నా ఎరుగని స్థితిలో , ఏమైనాసరే ఈరోజు భీష్ముని వధించి తీరుతానని ఒక్క ఉదుటున లేచి రథంపైనుంచి దూకడానికి సన్నద్ధుడు కావడం ఆత్రివిక్రముని స్నేహానురాగాలకు, ధీరగుణ సంపదకు నిలువుటద్దం.

ద్వాపరం లో కృష్ణావతారధరుడైన పరబ్రహ్మ కేవలం పరుల శ్రేయస్సు నిమిత్తం జన్మించి జీవితాంతం అనేక కష్టనిష్ఠూరాలను భరించాడు. దేవకీ వసుదేవుల తనయునిగా కంసుని చెరసాలలో దర్శన భాగ్యం కలిగించిన రోజునుంచి నిర్యాణ దినంవరకూ స్వార్ధప్రయోజనానికి కాక, ఆ లీలామానుష విగ్రహుని ప్రతిచర్యా ఆపన్న రక్షణకు లోకహితానికి, దోహదపడ్డాయి. సద్భాగవత గరిమకు ఆలవాలంగా నిలచాయి.

పాలుతాగే ప్రాయంలో పూతానుసురను నిర్జించి, ఆపై శకట, ధేనుకాసురాది భయంకర రాక్షసగణాన్ని నిర్జించి, కాళీయమర్దనంతో నీటిలో విష కాలుష్యాన్ని నిర్మూలించి, ప్రకృతి వైపరీత్యాలలో గోపగోపీ జనరక్షణకు చిటికెనవ్రేలుతో గోవర్ధన గిరినెత్తినప్పుడు "అమ్మో ఇంత చిన్నవాడు ఇంత దైత్యసంహారం చేశాడా అని నివ్వెరపోయారు. , తానే పరబ్రహ్మనని ఆపురుషోత్తముడు సాక్షాత్ ఆ బ్రహ్మదేవునికే తెలియ జేసిన తరుణంలో, మన్నుతిన్న నోట యశోదమ్మకు అండపిండ బ్రహ్మాండాన్ని పొడచూపినప్పుడూ ఇతగాడు పసివాడు కాదు సుమా సాక్షాత్ మహావిష్ణువే అని కైమోడ్చారు. అంతలో కన్నయ్య మాయావిభూతికిలోనై పరమాత్ముణ్ణి నవనీతచోరుడైన బాలుడే నని భ్రమించారు. బృందావన సీమలో రాచక్రీడ వేళ అంతులేని ప్రేమాను భూతితో కృష్ణుడేసర్వస్వంగా భావించారు. అలా ఒకవైపు రసజ్ఞునిగా మరోవైపు ప్రాజ్ఞునిగా భాసిల్లాడు.

అన్న అన్నబలరాముని కోపావేశాలను ఎరిగి, లౌకికపథంలో సోదరి సుభద్రను ప్రేమించిన అర్జునితో ధైర్యంగా వివాహం చేసి మన్ననలను పొందిన నటనసూత్రధారి.

ధర్మసంరక్షణకు నడుం బిగించి ధర్మనిర్వహణను ఆచరణగతం చేసే తరుణంలో బుద్ధికుశలత తనదిగా క్రియా ధర్మం ఎదుటివారిదిగా ప్రవర్తించి కురుక్షేత్ర సంగ్రామాన్ని నడిపించి అపార ప్రజ్ఞామూర్తి పార్ధసారధి. పరమాత్ముడు గీతాబోధలో చెప్పినట్లే "కర్మణ్యేవ్యాధికారశ్చమాఫలేషు కధాచనా" సూక్తప్రకారం కర్మ చేసే కర్తవ్యాన్ని మాత్రమే తాను వహించి ఫలితం మీద తన సాధికారత లేకుండా దాన్ని పదిమందికీ పంచిపెట్టిన ఆచరణగత ధర్మోపదేశకుడు. సదా సచ్చిదానంద స్వరూపుడైన కృష్ణ పరమాత్మకు రాగము లేదు ద్వేషమూ లేదు. సరికదా నిందలను కూడా హసిస్తు భరించే పూర్ణ పురుష వ్యక్తిత్వం కృష్ణ తత్వం. కట్టకడకు తాను చేయని తప్పుకుసైతం యాదవకుల నాశనమవ్వాలని గాంధారిచేత శాపం పొంది పాదసీమలో బోయవాని శరఘాతానికి లోనై నిర్యాణం పొందిన విజ్ఞతా స్వరూపుడు శ్రీకృష్ణ పరమాత్మ.

సామాన్యంగా మనం అందరం శ్రావణ బహుళాష్టమిని కృష్ణుడు పుట్టిన రోజంటూంటాం. కానీ నిజానికి అది పరబ్రహ్మ శ్రీకృష్ణావతారుడై మన చర్మచక్షువులకు కనుపించిన రోజు. ఆ నటనసూత్రధారి లేని కాలమేది. ఉండని ప్రదేశమేది. అనిశం విశ్వమంతా వ్యాపించివుండే సర్వాంతర్యామికదా, అజగత్కర్త. సకల ప్రాణులందు ఆత్మస్వరూపుడై కార్యకారణకర్తగా మెలగుతూ తనను కొలచిన వారిని సుజ్ఞానధనులను చేసె వేదస్వరూపుడు. శ్రీకృష్ణ పరమాత్మునియందు మనసు లగ్నం చేసి ఉపాసించేవారికి శాశ్వతానందం లభిస్తుంది. ఆనందమయకోశంలో స్వయంప్రకా శుడై కొలువైన పరబ్రహ్మ శ్రీకృష్ణపరమాత్ముని తత్వాన్ని ఆకళింపు చేసుకోగలిగినవారు. పరమహంసలై శోభిల్లుతారు. సర్వజగత్తునూ నడిపించే పరాత్పరుని దివ్యచరితామృతాన్ని పానం చేసే ఘనులు. భాగవత మాణిక్యములై భాసిల్లుతారు.

ధాతవు నీవే మా నేతవునీవే. అని నిరంతర శ్రీకృష్ణ పదసేవా భాగ్యాన్ని పొందగలిగిన వారు జనన మరణ పరిభ్రమణం నుండి విడివడి, హరిసన్నిధిలో శాశ్వతానందస్థానాన్ని పొందుతారు. విశ్వాత్మకుడూ ,శుభాకారుడు, కళ్యాణగుణమయుడూ అయిన శ్రీకృష్ణపరమాత్ముని సేవించేవారి పాలిట కామధేనువై వారివారి ధర్మబద్ధమైన కోర్కెలను తీరుస్తూ తన గుండెలో దాచుకునే దేవాదిదేవుడతడు. జగద్గురువైన శ్రీకృష్ణ కథా శ్రవణంతో, శ్రీకృష్ణ నామస్మరణతో. జీవులసమస్త పాపాలూ నసించి, ఇహలోక సర్వసుఖ ప్రాప్తితో. పరమపదాన్ని చేరి శాశ్వత మోక్ష ప్రాప్తి కలుగుతుంది.

శ్రీకృష్ణ గాథ జుంటి తేనె. తనపై ప్రేమానురాగాలు ప్రోది చేసుకున్న వారేమి కోరినా ఎంత కష్టమైనా భరించి వారి కోరిక తీర్చిన ఆ పరతంత్రుని కథ విన్నా, చదివినా, ఆ జగదేక విభుని దివ్యనామాన్ని స్మరించినా వారికి మరి పుట్టుక వుండదు.

- పారుపల్లి శ్రీరామచంద్రమూర్తి

47

# పరమార్థ కథలు



## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

శ్రీశుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి.

# సృష్టియందు మానవుని ప్రత్యేకత

**పూ**ర్వ మొకానొక యరణ్యమున అనేకమృగములు నివసించుచు చక్కగ కాలక్షేపము చేయుచుండెను. ఒకనాడొక నక్కకు ఆకస్మికముగా నొక ఊహతట్టెను. బ్రహ్మదేవుడు ఎనుబదినాలుగు లక్షల జీవరాసులను విశ్వమున సృజింప ఒక్క మానవుడే ప్రాణులందఱిలోను

గొప్పవాడుగ ఏల చలామణి యగుచున్నాడు?! బలములోగాని, ఆకారములో గాని ఊహాపోహలలోగాని, తిండిలోగాని, మోసములోగాని మానవుని మించిన శక్తియుక్తులు గల ప్రాణికోట్లు యెన్నియో యుండ మానవుడు తానే గొప్పయని తలంచుట వెఱ్ఱి! శాస్త్రాదు లాప్రకారము ఆదేశించుటయు, అందులకు సమ్మతించుటయు చాల ఘోరము, అది కేవలము పక్షపాతమే యగును. కావున నిజానిజములు తేలవలెను. ప్రపంచములో మానవుని యాధిక్యతను నేనిపుడు 'సవాల్' చేయగలను. ఈ విషయము తాడో పేడో తేలువఱకు నేనిక నిదురపోను– అని నిశ్చయించి అదేపని గట్టుకొని అరణ్యమంతయు తిరిగి తిరిగి ప్రతిమృగమునకును తనకు గల్గిన అభిప్రాయమును నచ్చజెప్పి, వానిని రెచ్చగొట్టి, వానికి

రోషావేశములను గల్పించి తన వెనుక వేసుకొనగల్గెను. ఈ ప్రకారముగ అరణ్యములోని జంతుజాలమంతటిని నక్క ఒకచోట సమావేశపఱచి, ఆ , చతుష్పద మహాసభ యందిట్లు ఉపన్యసింపదొడగెను.

"సోదరులారా! మన

మృగజాతియొక్క చరిత్రయందు నేడు సువర్ణాక్షరములతో లిఖింవదగిన సుదినమై యున్నదని మీరందరును జ్ఞప్తియందుంచుకొనవలెను. ఏలననగా ఈనాడొక మహత్తర నిర్ణయము గావింవబడుచున్నది. ఈ అనంత విశ్వమందు కోట్లకొలది ప్రాణికోటులుండ, ఒక్క మానవుడు స్వార్థచింతనచే ప్రేరితుడై తన్ను సర్వోపరిస్థానమున నిలబెట్టుకొని యున్నాడు. ఆతని యభిప్రాయమునకు శాస్త్రములున్ను తాళము కొట్టినవి. ఇది సహింపరాని విషయము. దీనిని చులకనగా వదలివేయుట మన మృగజాతికే తీరని కళంకము. బలమందా, యోచనయందా, ఆకారమందా దేనియందు వానికంటె మనము తక్కువ? సోదరులారా! తీవ్రముగా యోచింపుడు! మనజాతిపై అభిమానము గల్గియుండు మనజాతిలోగల అమానుషశక్తులను ఢంకా మ్రోగించి నలుగురికిని చాటుడు. 'సృష్టిలో మానవుడుకాదు, ఒకానొక జంతువే సర్వోపరిస్థాన మలంకరించుచున్నది'" అను తీర్మానమును ఏకగ్రీవముగ సర్వులును ఆమోదించు నంతవఱకును మనకర్తవ్యము అపూర్ణముగనే యుండునని మఱువకుడు. ఇక్కార్యసాధనమునకై మన మందఱమును ఇపుడు సమీపమున గల ఒకానొక మహర్షిసత్తముని యొద్దకుబోయి విషయమంతయు సాకల్యముగ అతనికి మనవి చేసెదము. మీమీ శక్తులను, స్వభావములను ఆతని సమ్ముఖమున వ్యక్తము చేయుడు" అని గంభీరముగ బలికి ఆ జంతువుల నన్నిటిని అటకు గొనిపోయెను.

మహర్షియొక్క అధ్యక్షతక్రింద జంతునివహమంతయు సమావేశమయ్యెను. అన్నియు నిశ్చలముగ గూర్చుండినవి, ఇంతలో ఏనుగు లేచి, "మహాత్మా! నాకు గల బలములో నూఱవవంతైనను మనుష్యునకు లేదు. ఆకారము చూతమా నా మోకాలంత స్వరూపము కూడ అతనికి లేదు. అట్టిచో మానవుడేల గొప్పవాడగును? అని రోషముతో బల్కి కూర్చుండెను. ఇంతలో సింహము లేచి తన పరాక్రమమును చాటుకొని మానవుని యల్పత్వమును ఋజువు చేసెను. ఇట్లు అన్ని జీవరాసులున్ను తమ విలక్షణ గుణములను ఉగ్గడించి, జంతువుల శ్రేష్ఠత్వమును చాటుకొనెను. మఱియు ఆ మహర్షిని తీర్పు నివ్వవలసినదిగా వేడుకొనెను. అత్తఱి మహర్షి వాని

వాదములన్నిటిని ప్రశాంతముగా నాలకించి తుదకిట్లు పలికెను "ఓ మృగసత్తములారా! మీరు చెప్పినది యంతయు పరమసత్యము!! మీ శక్తులముందు మానవుడు గణనకే రాడు. కాని ఒక్కవిషయములో మాత్రము మానవుడు మిక్కిలి యధికుడు. పుట్టుకతో వచ్చిన దుష్టసంస్కారములను మీరు మార్చుకొనలేరు. మానవుడు మార్చుకొనగలడు. ఇదియే అతని ఆధిక్యతకు కారణము. ఇదియే మీకును అతనికి గలభేదము" ఋషిసత్తముని గంభీర విజ్ఞానపూరితములగు ఆ పలుకులను విని నక్క తత్క్షణమే లేచి "అయ్యా! మహానుభావా! పుట్టుకతో వచ్చిన దుష్టసంస్కారమును మార్చుకొనగల్గుటచే మానవు డధికుడని తాము సెలవిచ్చితిరిగదా! అట్లు మార్చుకొననిచో?!" అని ప్రశ్నించెను. "మార్చుకొననిచో మీ యందఱికంటెను మనుజుడు నీచాతినీచుడే" అని యాతడు తేల్చి చెప్పివేసెను. న్యాయపరిపూర్ణములును, పక్షపాతరహితములునగు అమ్మహర్షి వాక్యములను విని జంతువులన్నియు "భేష్ భేష్" అని సంస్తుతించుచు అచ్చోటు వీడి చనెను.

నీతి:– తమయందలి దుష్టసంస్కారములను జనులు ప్రయత్నపూర్వకముగ తొలగించుకొని సత్సంస్కారములను కలుగజేసి కొనవలయును. ❑



కలకత్తాలో ఒక పాఠశాల ఆటస్థలం పక్కగా ఒకసారి శ్రీరామకృష్ణ పరమహంస నడచి వెళ్తున్నారు. నడుస్తున్నా ఆయన ఒళ్ళు తెలీని ధ్యానస్థితిలో వున్నారు. అప్పుడు ఉన్నట్టుండి ఒక ఫుట్‌బాల్ బ్రహ్మాండమైన వేగంతో వచ్చి ఆయన వీపుకు తగిలింది. ఆ దెబ్బకు ఆయన దిమ్మెరపోయి కొంతసేపటికి తేరుకున్నారు.

'ఏదో విషయం గమనించమని కాళీమాత నన్ను హెచ్చరిస్తోంది' అని అనుకుంటూ బంతి వచ్చిన వైపు చూశారు. తేజస్సు ఉట్టిపడే ఒక అందమైన బాలుడు ఆయన వైపు తదేకంగా చూస్తున్నాడు. రామకృష్ణులతని విశాలమైన కన్నుల్లోకి ఒకసారి చూశారు. 'అతన్ని చూడు' అన్న అమ్మ ఆంతర్యం అర్థమైంది. ఆ బాలుడే నరేంద్రుడు – కాబోయే వివేకానందుడు






# అష్ట వినాయక క్షేత్రాలు!

అష్ట వినాయక క్షేత్రాలు దర్శిస్తే సకలకష్టాలు తొలగి, సర్వసుఖాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**1. మయూరగణపతి క్షేత్రం.**

ఈ క్షేత్రం బారామతి తాలూకాలోని 'మోర్ గావ్' గ్రామంలో ఉంది. ఈ క్షేత్రంలో ఉండే వినాయకుని 'మయూరేశ్వర్' అని పిలుస్తారు. నిజానికి వినాయకుని వాహనం ఎలుక కదా. కానీ, ఇక్కడ వినాయకుని వాహనం మయూరం (నెమలి).

పూర్వం సింధురాసురుడు అనే రాక్షసుడు ఈ ప్రాంతంలోని ప్రజలను, మునులను, దేవతలను నానా కష్టాలు పెడుతూంటే.., వారు రక్షించమని వినాయకుని ప్రార్థించారు. అప్పుడు వినాయకుడు మయూరవాహనం మీద వచ్చి ఆ రాక్షసుణ్ణి సంహరించి అందరికీ ఆనందం కలిగించాడు. ఇక్కడి వినాయకుడు మయూరవాహనం మీద భక్తులకు దర్శనమిస్తాడు.

అందుకే ఈ స్వామిని "'మోరేశ్వర్' " అని పిలుస్తారు. హిందీభాషలో మోర్ అంటే 'నెమలి'.

అరణ్యవాస కాలంలో పాండవులు ఈ స్వామిని పూజించారని, వారు పూజించిన అసలైన వినాయక విగ్రహం, ప్రస్తుతమున్న విగ్రహానికి వెనుక ఉన్నదనీ స్థానికులు చెప్తారు. ఈ ఆలయం చూడడానికి హిందూ ఆలయంలా కాక నాలుగువైపులా మినార్లతో మసీదులా కనిపిస్తుంది. తురుష్క చక్రవర్తుల దాడుల నుంచి కాపాడడం కోసం ఈ ఆలయాన్ని అలా కట్టారనీ, బహమనీయుల కాలంలో ఈ ఆలయం నిర్మించబడిందనీ చరిత్రకారులు చెప్తారు. ఈ క్షేత్రంలో వినాయకచవితినాడు, విజయదశమినాడు ఎంతో వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి.

**2. సిద్ధివినాయక క్షేత్రంల**

ఈ క్షేత్రం అహ్మదునగర్ జిల్లాలోని 'శ్రీగొండ' పట్టణానికి సమీపంలోనున్న చిన్న కొండ మీద ఉంది. ఈ ఆలయాన్ని పేష్వాలు నిర్మించారు. సాధారణంగా వినాయకుని తొండం ఎడమచేతి వైపు వొంగి ఉంటుంది. కానీ, ఇక్కడి వినాయకుని తొండం మాత్రం కుడిచేతి వైపుకు వొంగి ఉంటుంది. అదే ఈ వినాయకుని ప్రత్యేకత. ఇక్కడి వినాయకుడు సిద్ధి, బుద్ధి సమేతుడై కొలువుతీరి ఉంటాడు. పూర్వం మధు,కైటభులనే రాక్షసులను సంహరించడం కోసం శ్రీమహావిష్ణువు ఈ వినాయకుని సహాయం తీసుకున్నాడనీ, అందుకు కృతజ్ఞతగా శ్రీమహావిష్ణువే స్వయంగా ఈ లంబోదరుణ్ణి ఇక్కడ ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించాడనీ స్థలపురాణం చెప్తుంది. ఈ ఆలయానికి ఒక్క ప్రదక్షిణ పూర్తి చేయాలంటే సుమారు అరగంట సేపు కొండ చుట్టి రావాల్సిందే. అయినా కోరిన కోరికలు తీర్చే కార్యసిద్ధి గణపతి కనుక భక్తులు ఎంతో భక్తిగా గిరి ప్రదక్షిణం చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు.

**3. బల్లాలేశ్వర క్షేత్రం.**

'పాలి' అనే గ్రామంలో ఉంది. పూర్వం ఈ గ్రామం పేరు 'పల్లిపుర్'. ఈ గ్రామానికి చెందిన కల్యాణ్ సేర్ కుమారుని పేరు 'బల్లాల్'. ఇతను గొప్ప వినాయక భక్తుడు. బల్లాల్ తన స్నేహితులతో కలసి అడవికి వెళ్లి అక్కడున్న రాతి వినాయకుని పూజించి, రోజూ ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడట. అతని స్నేహితుల తల్లిదండ్రులు ఈ విషయం తెలుసుకుని కల్యాణ్ సేర్ కు ఫిర్యాదు చేసారు. కోపం వచ్చిన సేర్ 'బల్లాల్'ను అడవికి తీసుకునివెళ్లి, అతన్ని చెట్టుకి కట్టి స్పృహతప్పేలా చావకొట్టి, ఆ రాతివిగ్రహాన్ని విసిరేసి వెళ్లిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న బల్లాల్, వినాయకుని ప్రార్థించాడు. వినాయకుడు వచ్చి బల్లాల్ కట్లువిప్పి విడిపించి, ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. 'ఈ రాతిలోనే నువ్వు ఉండాలి' అని కోరుకున్నాడు. భక్తుని కోరిక మేరకు వినాయకుడు ఆ రాతివిగ్రహంలో ఐక్యమయ్యాడు. ప్రస్తుతం ఆలయంలోనున్న విగ్రహం అదే. ముందు ఈ ఆలయాన్ని చెక్కలతో నిర్మించారు. ఈ ఆలయం వెనుక దుండి వినాయకుడి విగ్రహం ఉంటుంది. అదే బల్లాల్ తండ్రి విసిరిపారేసిన రాతి వినాయకవిగ్రహం. భక్తులు ముందుగా దుండి వినాయకుని దర్శించాకే ప్రధాన ఆలయంలోని వినాయకుని దర్శిస్తారు. బల్లాల్ కోరిక మేరకు వెలిసిన ఈ వినాయకుని 'బల్లాలేశ్వర్' అని పిలుస్తారు.

**4. వరదవినాయక క్షేత్రం**

పుణె నగరానికి ఎనభై కిలోమీటర్ల దూరంలోని 'మహద్' గ్రామంలో వెలిసిన ఈ గణపతిని 'వరదవినాయకుడు' అంటారు. పూర్వం ఈ ప్రాంతాన్ని రుక్మాంగదుడు అనే రాజు పాలించేవాడు. ఒకరోజు రుక్మాంగదుడు భార్యా సమేతుడై ఈ గ్రామంలోని 'వాచక్నవి' దర్శనార్థం వచ్చాడు. ఋషిపత్ని మహారాజుని చూసి ముచ్చటపడుతుంది. మహారాజు ఆమె కోరికను సున్నితంగా తిరస్కరించి వెళ్లిపోయాడు. ఈ సంగతి తెలిసి ఇంద్రుడు మహారాజు రూపంలోవచ్చి ఋషిపత్నితో కలుస్తాడు. ఆ కారణంగా 'గృత్సమధుడు' అనే పుత్రుడు కలుగుతాడు. అతను పెరిగి పెద్దవాడయ్యాక, తన జన్మరహస్యం తెలుసుకుని వినాయకుని గురించి తపస్సు చేసాడు. వినాయకుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమన్నాడు. 'అందరి పాపాలు పోయేలా నువ్వు ఇక్కడ ఉండాలి' అని కోరాడు. అతని భక్తికి మెచ్చి వినాయకుడు అక్కడ స్వయంభువుడుగా వెలిసాడు. అదే వరదవినాయక క్షేత్రం. ఈ ఆలయంలోని దీపం 1892 నుంచీ అఖండంగా వెలుగుతూనే ఉండడం విశేషం. ఈ స్వామిని భక్తులు స్వయంగా తాకి, అర్చనలు చేసుకోవడం ఈ ఆలయం ప్రత్యేకత.

**5. చింతామణి గణపతి క్షేత్రం.**

పుణెకు 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'థేవూర్' గ్రామంలో ఈ క్షేత్రం ఉంది. ఈ గ్రామంలో ఒకప్పుడు కపిల మహాముని కొంత కాలం తపస్సు చేసాడట. ఆయన దగ్గర భక్తుల కోరికలు తీర్చే 'చింతామణి' అనే మణి ఉంది. ఓసారి ఈ ప్రాంతాన్ని పాలించే అభిజిత్ మహారాజు

కుమారుడు 'గుణ' కపిలమహర్షి ఆశ్రమానికి వచ్చి ఆ మణి ప్రభావాన్ని గుర్తించి, ఆ మణిని అపహరించాడు. కపిలమహర్షి గణపతి సాయంతో ఆ రాజును జయించి ఆ మణిని తిరిగి పొంది దాన్ని గణపతి మెడలో అలంకరిస్తాడు. అప్పటి నుంచి ఈ గ్రామం 'కదంబనగర్' గానూ.., ఈ స్వామి 'చింతామణి గణపతి' గానూ ప్రసిద్ధి పొందాడు. ఈ ఆలయాన్ని పేష్వాల కాలంలో నిర్మించారు.

**6. గిరిజాత్మజ్ వినాయక క్షేత్రం.**

పుణెకు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'లేన్యాద్రి' పర్వతంమీద బౌద్ధగుహల మధ్యన ఉన్న ఆలయమే 'గిరిజాత్మజ్ వినాయక ఆలయం'. పార్వతీదేవి సంతానం కోసం ఇక్కడ పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసిన తర్వాతే నలుగు పిండితో చేసిన బాలగణపతికి ప్రాణం పోసిందనీ, తనకు కౌమారప్రాయం వచ్చేవరకూ గణపతి తన తల్లితో కలిసి ఇక్కడే ఉన్నడనీ పౌరాణిక ప్రమాణం. ఈ గణపతి అచ్చు నలుగుపిండితో చేసినట్టే...రూపురేఖలు స్పష్టంగా కనిపించకుండా ఉంటాడు. ఈ గణపతిని దర్శించాలంటే 307 మెట్లు ఎక్కాలి. స్తంభాలు లేకుండా కేవలం ఏకశిలనే ఆలయంగా మలిచి మెట్లు నిర్మించారు. విద్యుద్దీపాల అవసరం లేకుండా పగటివేళలో సూర్యకిరణాలు ఆలయంలో పడేలా నిర్మించడంచేత ఈ స్వామిని సుఖంగా దర్శించకోవచ్చు. అదే ఈ ఆలయం ప్రత్యేకత.

**7. విఘ్నహార్ వినాయక క్షేత్రం.**

ఓఝూర్ పట్టణంలో కుకడి నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. ఈ ఆలయంలోని వినాయకుడు ...సిద్ధి, బుద్ధి సమేతుడై కొలువుతీరి ఉంటాడు. పూర్వం ఈ ప్రాంతంలో విఘ్నాసురుడు అనే రాక్షసుడు మునులను హింసిస్తూంటే.., వారు వినాయకుని ప్రార్థించగా..ఆ ఏకదంతుడు చాలా కాలం ఆ రాక్షసునితో యుద్ధం చేసాడు. వినాయకుని గెలవడం తనవల్ల కాదని గ్రహించిన ఆ రాక్షసుడు వినాయకుని శరణుకోరి, తన పేరుమీద నీవు ఇక్కడే కొలువుతీరాలనీ వేడుకున్నాడు. వినాయకుడు అతని కోరిక తీర్చాడు. అందుకే ఈ స్వామిని 'విఘ్నహార్ వినాయక్' అని అంటారు. అప్పట్లో ఈ స్వామికి మునులే ఆలయం కట్టించారు. తరువాతి కాలంలో 'చిమాజి' ఆ ఆలయాన్ని పునర్నిర్మించాడు. బంగారుపూతతో మిలమిల మెరిసే ఈ ఆలయశిఖరం చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

**8. మహాగణపతి క్షేత్రం.**

'రంజన్ గావ్'గా పిలవబడే ఈ గ్రామంలో కొలువున్న ఈ వినాయకుడినే 'మహాగణపతి'గా భావించి కొలుస్తారు. త్రిపురాసుర సంహార కాలంలో పరమేశ్వరుడే ఈ గణపతిని తలచుకుని యుద్ధం చేసి వారిని సంహరించాడు. అందుకు ప్రతిగా శివుడే ఈ 'మహాగణపతిని' ఇక్కడ ప్రతిష్ఠించాడనీ...గణేశపురాణం చెబుతుంది.

దక్షిణాయనంలో సూర్యకిరణాలు నేరుగా ఈ విగ్రహంమీద పడేలా ఈ ఆలయం నిర్మించడం ఈ క్షేత్రం ప్రత్యేకత. 18 వ శతాబ్దంలో పేష్వాలు ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. సిద్ధి, బుద్ధి సమేతుడై పద్మంలో కొలువు తీరివుండే ఈ వినాయకుడి విగ్రహానికి క్రింది భాగంలో పది తొండాలు, ఇరవై చేతులు గల 'మహోత్కట్' వినాయకుని విగ్రహం ఉందని భక్తులు చెబుతారు గానీ.. అది నిజం కాదని ఆలయ ధర్మకర్తలు చెప్తారు.ఈ ఎనిమిది వినాయక క్షేత్రాలలోనూ అర్చనలు, అభిషేకాలు, ప్రసాద వితరణలు ఒకే విధంగా ఉంటాయి.

ఈ క్షేత్రం దర్శించుకున్నాక తిరిగి 'మయూరేశ్వరుని' దర్శిస్తేనే ఈ యాత్ర పూర్తయినట్లు అని భక్తులు గ్రహించాలి.....! ❑



## గణేష్ ఉత్సవాలకు జీవం పోసిన ధన్యుడు --- బాలగంగాధర్ తిలక్!

"వినాయకుడు ప్రతి ఇంట్లో కొలువై ఉంటే... తిలక్ గారు ఆ వినాయకుడిని ప్రతి వీధిలోకి తీసుకొచ్చారు!" ఒకప్పుడు గణేష్ చతుర్థి ఎక్కువగా ఇళ్లలోనే జరిగే పండుగగా ఉండేది. 1890లలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గారు దాన్ని ఒక భారీ సామూహిక ఉత్సవంగా విస్తరించారు. ప్రజలను ఒకచోట చేర్చి, సామాజిక ఐక్యతను పెంచడంతో పాటు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జాతీయ చైతన్యాన్ని రగిలించడానికి గణేష్ ఉత్సవాన్ని ఒక వేదికగా ఉపయోగించారు.

"గణపతి బప్పా మోరియా!" అది కేవలం నినాదం కాదు... అది ఐక్యతకు నినాదం! అది ఆత్మగౌరవానికి నినాదం! అది స్వాతంత్ర్య కాంక్షకు నినాదం!

అందుకే నేడు దేశవ్యాప్తంగా వైభవంగా జరిగే సార్వజనిక గణేష్ ఉత్సవాల వెనుక తిలక్ గారి ప్రజా చైతన్య దృష్టి ఒక గొప్ప అధ్యాయం. అయితే చారిత్రక ఆధారాల్లో సార్వజనిక గణేష్ ఉత్సవాల ప్రారంభానికి భౌసాహెబ్ రంగారి తదితరుల పాత్ర కూడా ప్రస్తావించబడుతుంది; తిలక్ గారి ప్రధాన కృషి దాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా మార్చడంలో ఉంది.

"వినాయకుడిని పూజించిన వారు ఎందరో... కానీ వినాయకుడి వేదికపై ఒక జాతిని మేల్కొలిపిన మహానుభావుడు --- లోకమాన్య బాలగంగాధర్ తిలక్!" గణపతి బప్పా మోరియా! ❑

## విఘ్నరాజాయా నమోస్తుతే!

**శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే!**

–అని వినాయకుణ్ణి తొలిగా అర్చించనిదే ప్రపంచ వాసులకు మేలు కలుగదు.

శ్రీ వినాయకుడెటువంటి వాడయా – అంటే తెల్లని వస్త్రములను ధరించి, దేవదేవుడైన విష్ణువు వలె జగద్వ్యాపకుడై, చంద్రుని వలె స్వచ్ఛమైన కాంతి కలిగి, చతుర్బాహు సమేతుడై నిరతమూ ప్రసన్న వదనంతో, శాంత స్వభావుడై, సర్వ విఘ్నములనూ నివారిస్తూ, సర్వే సర్వత్రా శుభములను గూర్చు వాడు. ఆయనకు తొలి నమస్కారం చేయడం సర్వదా శుభదాయకం. శుభా శుభ కర్మలయందు సహితమూ వినాయకుణ్ణి తొలిగా పూజించడం శుభదాయకం. ప్రపంచ దేశాలన్నిటిలో శ్రీ వినాయకుడు వివిధ రూపాల్లో ఉన్నాడు; అర్చింపబడ్తున్నాడు. వినాయకుడు విశ్వవ్యాపకుడు.

దేవ మానవ పశు పక్షి నాగ గంధర్వ రాక్షస గణం సహితమూ వినాయకుణ్ణి తొలిగా ప్రార్థించడం ఆచారంగా వస్తూంది జగత్సూలపురుషుడైన శ్రీకృష్ణుడు సహితమూ, చవితినాడు వినాయక చవితి అక్షతలు శిరస్సుపై వేసుకోనందున నీలాపనిందలకు గురికావలసి వచ్చింది.

భూమి పాదములుగా, ఆకాశము నాభిగా, వాయువు ప్రాణముగా సూర్య చంద్రులు నేత్రములుగా, దిశలు శ్రవణేంద్రియములుగా, స్వర్గము శిరస్సుగా, అగ్ని నోరుగా, సముద్రము పొత్తికడుపుగా కలిగిన విష్ణువాంశ సంభూతుడైన శ్రీకృష్ణునికే అలాటి నీలాపనింద కలిగి, నిష్టూరం పాలయినపుడు సామాన్యుని విషయం చెప్పనగునా ! శ్రీ గణనాయకం నమోస్తుతే అంటూ పై శ్లోకాన్ని పఠిద్దాం. ❑




# నైతిక విలువలకు నిలువెత్తు అద్దం 'తెన్నేటి'

**మహనీయులు – మహానుభావులు:**

పురుషులందు పుణ్య పురుషులు వేరయా" అని వేమన అన్నాడు. పురుషులు చాలామంది ఉంటారు. కానీ వారిలో ఎన్నదగిన పుణ్యపురుషులు చాలా కొద్దిమంది ఉంటారు. మనుష్యులు కొన్ని లక్షలమంది ఉంటారు. కానీ మహనీయులు, మహానుభావులు మటుకు పదుల సంఖ్యలో మాత్రమే ఉంటారు. వారు ఏ మతానికీ, కులానికీ, వర్గానికీ, ప్రాంతానికీ, రాజకీయ పార్టీకి చెందిన వారయినా అందరూ వారిని గౌరవిస్తారు. అభిమానిస్తారు. తలవంచి నమస్కరిస్తారు. వారి వ్యక్తిత్వం, వారు ప్రాతినిధ్యం వహించే మతం, కులం, వర్గం, ప్రాంతం రాజకీయ పార్టీకన్న గొప్పది. మహాత్మా గాంధి. బాబు రాజేంద్రప్రసాద్, లాల్బహదూర్ శాస్త్రి పుచ్చలపల్లి సుందరయ్య, ఎ.బి. నాగేశ్వరరావు వావిలాల గోపాల కృష్ణయ్య ఇటువంటివారే. తెన్నేటి విశ్వనాదం కూడా అటువంటి కోవకు చెందినవారే.

**గాంధీ పిలుపు:**

20వ శతాబ్దాన్ని ఒక మలుపు త్రిప్పిన అనేకమంది తెలుగు కవులు, పాత్రికేయులు, చిత్రకారులు, తత్వవేత్తలు, రాజకీయ నాయకులు జన్మించిన బంగారు దశాబ్దం (1890 దశకం)లోనే విశ్వనాథంగారు జన్మించారు. 1895 సెప్టెంబరు 9వ తేదీన విశాఖపట్టణం లక్కవరం గ్రామంలో జన్మించారు. వీరు బి.ఏ. ఆనర్సు బి.ఎల్. పట్టభద్రులు. ఆయన । బాల్యమంతా వందేమాతరం వంటి ఉద్యమాలతో సాగుతూ జాతీయ భావచైతన్య వాయువుల మధ్య గడిచింది. అందువలనే ప్యాసవగానే ప్రాక్టీస్ పెట్టి డబ్బు సంపాదించాలని అనుకోలేదు. దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించారు. । ఆ సమయంలో మహాత్మా గాంధీ పిలుపు వేదవాక్కులా, ఉపనిషద్వాణిలా వినిపించింది. మహాత్ముని శంఖారావం విశ్వనాథంగారిని ఉత్తేజపరచి స్వాతంత్ర్య సమరంలో తలమునకలుగా పాల్గొనేట్టు చేసింది. ప్రాక్టీస్ వదలివేశారు.

**అధ్యాపకునిగా....:**

మహాత్మాగాంధీ ప్రభావవశుడైన శ్రీ విశ్వనాథం సబర్మతి ఆశ్రమాన్ని జేరుకుని ఆయన పాదసన్నిధిలో గడిపారు. విశ్వనాథం వాక్పటిమ, విషయ పరిజ్ఞానం, నిశిత పరిశీలనా దృష్టి అన్నిటినీమించిన సౌశీల్యం, వ్యక్తిత్వం గాంధీజీని విశేషంగా ఆకర్షించాయి. గాంధీజీ అభిమతం. మేరకు గుజరాత్ విద్యాపీఠంలో కొంతకాలం అధ్యాపకునిగా సేవలందించారు. ఆ తర్వాత 1920 దశకం మధ్యనాటికి విశాఖకు వచ్చి అక్కడే స్థిరపడి 1979 నవంబరులో మరణించే వరకు విశాఖ ప్రజా జీవితానికి కేంద్ర బిందువుగానే ఉన్నారు.

**విశిష్ట వ్యక్తిత్వం:**

1920వ దశకంలోనే రాష్ట్రానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులలో విశ్వనాధం ఒక్కరయ్యారు. మహాత్మా గాంధీతో సహా ఏ జాతీయ నాయకులు విశాఖపట్టణానికి వచ్చినా విశ్వనాథంగారి ఇంట బసచేసి ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించవలసించే, 1926 నాటికే ఆయన ఎ.ఐ.సి.సి. సభ్యునిగా ఎన్నికయ్యారు. మహాత్మాగాంధీజీ నాయకత్వంలో జరిగిన ప్రతి స్వాతంత్ర్య సమర ఘట్టాలలో పాల్గొని జైలు శిక్షను అనుభవించారు. జైలులో ఉండగా అనేకమంది ప్రముఖ నాయకులతో ఆయనకు పరిచయ భాగ్యం ఏర్పడింది. అది సన్నిహిత స్నేహంగా మారింది.

విశాఖపట్టణం మున్సిపల్ ఛైర్మన్గా, శాసనసభసభ్యుడు, రాష్ట్రమంత్రి, పార్లమెంటు సభ్యుడు, కాఫీబోర్డు అధ్యక్ష పదవులు ఆయనను వరించాయి. ఏ పదవినీ ఆయన కోరుకోలేదు. వచ్చిన పదవిని తిరస్కరించలేదు. అధిష్టించిన పదవికి అన్ని విధాలా న్యాయం చేశారు. ఆయన ఏ పదవినీ అంటిపెట్టుకుని ఉండలేదు. నైతిక కారణాలవలన పదవికి రాజీనామా చేయాలన్న నిర్ణయాన్ని ఆయన ఒక్క నిమిషంలో తీసుకునేవారు. పదవిని తృణప్రాయంగా త్యజించేవారు. ఆయన వ్యక్తిత్వంలోని విశిష్ఠత ఇదే.

**నైతికత్వంతో కాంగ్రెస్ నుండి వైదొలగి... :**

ఇందుకు ఒక ఉదాహరణ ఆయన ఆంధ్ర నాయకులలో ఆంధ్రకేసరికి అత్యంత సన్నిహితులలో ఒకరు. 1951 ప్రాంతంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సంజీవరెడ్డి, ఆచార్య రంగాల మధ్య అతి తీవ్రమైన. ప్రతిష్ఠాకరమైన పోటీ జరిగింది. ఆనాడు ఆంధ్ర కాంగ్రెస్లో

సంజీవరెడ్డి, గోపాలరెడ్డి, కళా వెంకట్రావు నాయకత్వంలో అధికార వర్గం ఉండేది. ప్రకాశం, ఆచార్య రంగా నాయకత్వాలలో అసమ్మతి వర్గం ఉండేది. ఇరువర్గాలు తాడోపేడో తేల్చుకోవాలన్న పట్టుదలతో పి.సి.సి. అధ్యక్ష పదవికి పోటీ జరిగింది. అధికార వర్గం తరపున సంజీవరెడ్డి: ప్రకాశం, రంగా వర్గాల తరుపున ఆచార్య రంగా పోటీ చేసారు. అధిష్ఠాన వర్గం ఎస్.కె. పాటిల్ను పరిశీలకునిగా పంపింది. ఆ ఎన్నికల్లో సంజీవరెడ్డి ఐదు ఓట్ల తేడాతో గెలిచారు. ఆ ఎన్నికలల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రకాశం, రంగాలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ప్రజాపార్టీని స్థాపించుకున్నారు. ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలను ఒక మలుపు తిప్పిన సంఘటన ఇది. ప్రకాశంగారితో పాటు విశ్వనాథంగారు కూడా పార్టీ నుంచి వైదొలగి ప్రజాపార్టీలో చేరారు. అప్పుడు ఆయన విశాఖపట్టణం మున్సిపల్ చైర్మన్ గా ఉన్నారు. 1946లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు, కాంగ్రెస్ అభ్యర్థిగానే చైర్మన్ అయ్యారు. తను కాంగ్రెస్ టిక్కెట్టు మీద ఎన్నికయి కాంగ్రెస్ అభ్యర్థిగా చైర్మన్ అయ్యానని అందువలన కాంగ్రెస్ నుంచి రాజీనామా చేసి క్రొత్త పార్టీలో చేరినప్పుడు కాంగ్రెస్ ద్వారా సంక్రమించిన పదవిలో కొనసాగడం నైతిక విరుద్ధమని చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. నిజానికి ఆయన రాజీనామా చేయాలని ఎవ్వరూ కోరను కూడా లేదు. ఇటువంటి కారణాలవల్లనే మరోసారి తన ఎం.ఎల్.ఏ. పదవికీ రాజీనామ చేసి, మళ్లీ ఎన్నికల్లో నిలబడ్డారు. ఆయన మీద గౌరవంతో ఏ రాజకీయ పార్టీ తన అభ్యర్థిని నిలబెట్టలేదు. అది ఆయన నైతికోన్నతి.

**ఏ పదవులనూ కోరలేదు:**

1951లో ఆయన ప్రకాశంగారితో పాటు కాంగ్రెస్ నుండి వైదొలిగారు. కాంగ్రెస్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. తన రాజకీయ గురువు ప్రకాశం, ఆచార్య రంగా ఇంకా మరెందరో సన్నిహితులు తిరిగి కాంగ్రెస్‌లో చేరి పదవులు పొందినా విశ్వనాథంగారు చివరివరకు కాంగ్రెస్కు వ్యతిరేకంగా ఉండిపోయారు. నిజానికి జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి లు మీ సేవలు కాంగ్రెకు అవసరం మా పార్టీలో చేరండి మీకు సముచితమైన పదవి ఇచ్చి గౌరవిస్తామని ఆహ్వానించారు. కానీ విశ్వనాథంగారు కాంగ్రెస్ ద్వారా వచ్చిన ఏ పదవులనూ కోరుకోలేదు.

1937లో మద్రాస్ విధానసభకు జరిగిన ఎన్నికలలో విశ్వనాథంగారు కాంగ్రెస్ అభ్యర్థిగా విశాఖపట్టణం నుంచి. ఎన్నికయ్యారు. రాజాజీ నాయకత్వంలో తొలి కాంగ్రెస్ మంత్రి వర్గం ఏర్పడింది. ఆంధ్రకేసరి ప్రకాశంగారు రెవిన్యూ మంత్రి అయ్యారు. ఆయనకు పార్లమెంటరీ సెక్రటరీగా నియమితులయ్యారు. జమీందారీల రద్దు, గ్రామీణ రైతుల సమస్యలు, ఇరిగేషన్ సదుపాయాలు మొదలైన అనేక కీలక విషయాలలో ప్రకాశంగారికి విశ్వనాథంగారు కుడిభుజంగా పనిచేశారు.

**ప్రతిపక్ష నాయకుడిగా....:**

1952లో మద్రాస్ విధానసభకు జరిగిన ఎన్నికలలో ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు ఘోరంగా ఓడిపోయారు. ఆంధ్రలో కమ్యూనిస్టులు ఘన విజయాలు సాధించారు. మద్రాస్ విధానసభలో భారత కమ్యూనిస్ట్ పార్టీ, కిసాన్ మజ్దూర్, ప్రజాపార్టీలు యునైటెడ్ ఫ్రంటుగా ఏర్పడ్డాయి. యునైటెడ్ ఫ్రంటు లెజిస్లేచర్ పార్టీకి ప్రకాశం నాయకుడు కాగా విధానసభలో విశ్వనాథంగారు ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు.

ప్రతిపక్షనాయకునిగా విశ్వనాథంగారి విమర్శలు ఎంతో హుందాగా, నిర్మాణాత్మకంగా జరిగేవి. ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు ఎంతో శ్రద్ధగా ఆయన విమర్శలను ఆలకించేవారు. అడ్డు తగిలే ప్రయత్నం చేసేవారు కారు. ఇందుకు ఒక కారణం ఆయన విమర్శలు పెద్ద మనిషి తరహాగా ఉండడం కాగా, మరో కారణం మంత్రులకు కాంగ్రెస్ సభ్యులకు ఆయన పట్ల గల వ్యక్తిగత గౌరవం.

**ఒక్క ఓటు తేడాతో ఓటమి:**

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం అవతరించి ప్రకాశం మంత్రివర్గం ఏర్పడినప్పుడు విశ్వనాథంగారు ఆర్థిక, దేవాదాయ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. అయితే ఆ మంత్రివర్గం ఏడాదిన్నర తిరగకుండానే కూలిపోయింది. ఆ తర్వాత విశ్వనాథంగారిని ఏ అధికార పదవులూ చేపట్టలేదు. 1946లో మద్రాస్ శాసనసభ స్పీకర్ పదవికి తీవ్ర పోటీ జరిగింది. ప్రకాశం వర్గం తరుపున విశ్వనాథం, ఆయన వ్యతిరేక వర్గం తరుపున శివసణ్ముఖం పిళ్లై పోటీచేశారు. విశ్వనాథంగారు ఒక్క ఓటుతో ఓడిపోయారు. నిజానికి ఒక్క ఓటు తేడాతో పరిస్థితులు తారుమారు కావడం అదే మొదటిది. 1954లో ప్రకాశంగారి మంత్రి వర్గం ఒక్క ఓటు తేడాతో ఓడిపోయింది. 1998లో కేంద్రంలోని వాజ్‌పాయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పతనమయిన సంగతి తెల్సిందే.

**వెలుగు చూడని విషయాలెన్నో:**

ఆంధ్రకేసరి ప్రకాశంగారు తన స్వీయ చరిత్రను రాసుకున్నారు. అయితే అది అసమగ్రం. 1937లో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడే వరకు చరిత్రనే గ్రంథస్థం చేశారు. మిగిలిన జీవితాన్ని రచించుకునే తీరిక, ఓపిక ఆయనకు లేకపోయాయి. ఆయన తన చరిత్ర రచనను ఆపివేసిన కాలం నుంచి మరణించేవరకు అనేక సంఘటనలు జరిగాయి. నేటి తరం తెలుగు ప్రజలకు ఆయన జీవితం గురించి తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. ఇది గ్రహించిన ఎమెస్కోవారు ప్రకాశంగారు స్వయంగా వ్రాసుకున్న జీవిత చరిత్రను మూడు భాగాలుగా పునర్ముద్రిస్తూ నాల్గవ భాగంగా ప్రకాశంగారి మిగిలిన జీవిత చరిత్రను విశ్వనాథంగారి చేత వ్రాయించి అనుబంధంగా ప్రచురించారు. అందులో విశ్వనాథంగారు తన విశ్వరూపాన్ని చూపారు. వెలుగులోకి రాని అనేక విషయాలను వ్రాసారు. మహాత్మాగాంధీకి రాజాజిపట్ల ఉన్న మితిమీరిన పక్షపాతం, ప్రకాశంగారి పట్ల వైముఖం, రాజర్షి రాజాజీ అల్పత్వం, కామరాజు నాడార్ మోహం చాటివేయడం మొదలైన అనేక సంఘటనలను వివరించి తెలుగు ప్రజలకు ఎంతో మేలు చేశారు.

**ఉద్యమాలు – పోరాటాలు:**

విశ్వనాథంగారు అనగానే గుర్తుకువచ్చేది విశాఖ స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి అది అవతరించే వరకు విశ్వనాథంగారు అవిశ్రాంత పోరాటం జరిపారు.

**మంచి మనసున్న రచయిత:**

విశ్వనాథంగారు బహుభాషావేత్త, పండితుడు. సంస్కృతాంధ్ర, తమిళ, ఇంగ్లీషు, పర్షియన్ భాషలలో మంచి ప్రవేశం ఉంది. రచయిత, గ్రంథకర్త ఋగ్వేద విశేషాలను వివరిస్తూ తెలుగు విద్యార్థి పత్రికలో అనేక వ్యాసాలు వ్రాశారు. ఆయన రచించిన శ్రీరామ విప్రవాసనం నాటకం ఆంధ్ర విశ్వ విద్యాలయం బి.ఏ. విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించింది.

విశ్వనాథంగారు స్ఫురద్రూపి, అంతకన్నా ఆయన మనసు అందమయినది. ఆయన ధరించే బట్టలు స్వచ్ఛతకు మారుపేరైన తెల్లని ఖద్దరు వస్త్రాలు. ఆయన మనసు మల్లెపూవంత సున్నితమైనదీ, స్వచ్ఛమైనదీ.

విశ్వనాథంగారు సాహితీప్రియులు. సాహిత్య, సమావేశాలు, గోష్ఠులన్న ఆసక్తి. ఆయన తన నివాసంలో ప్రతి వారమూ సాహిత్య గోష్ఠిని ఏర్పాటు చేసేవారు. తను దివంగతుడయిన రోజున కూడా ఒక సాహిత్య గోష్ఠిని ఏర్పాటు చేశారు. విశ్వనాథంగారు మరణించిన తర్వాత అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విశాఖపట్టణం జగదాంబ సెంటర్లో విశ్వనాథంగారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

విశ్వనాథంగారు ఒకనాటి దేశ నాయకుల నైతికోన్నతికి, విశిష్ట వ్యక్తిత్వానికి ప్రతీక.

– శ్రీ కంచి వాసుదేవరావు, శ్రీవాణి

"గుడి కూలును నుయి పూడును
పడి నీళ్లకు చెరువు తెగును
వనమును ఖిలమౌ: చెదనిం పద్యం బొకటియె
కుడి యెడమల కీర్తిగన్న గువ్వల చెన్నా?"

తెలుగు దేశానికి, జాతికీ పేరు తెచ్చినది తెలుగు భాష, తెలుగు భాషకు కీర్తిని గడించి పెట్టినది తెలుగు పద్యం. మానవుడున్న చోట మాట ఉండును. మాటలు కలిసి భాష, భాష నుండి ప్రజల హితము నెంచు సాహిత్య రచనలు వచ్చును.

తెలుగువారికి అచ్చ తెనుగు బాసయున్నది. దేశకైతలును ఉన్నవి. దేశి ఛందస్సులును ఉన్నవి. తమిళ కర్ణాట భాషలందు తెలుగు పదము లెన్నియో ఉన్నవి. తెలుగు బాస స్వతంత్రమై పరిణామము నందినదనియు క్రీ.శ. ప్రథమ శతాబ్దము నాటికే విరివిగా వ్యాప్తియందున్నదనియు ఒక వాదము బలముగానే యున్నది. కందము, మధ్యాక్కరలు, సీసము, తేటగీతి మున్నగు ఛందములు అచ్చతెనుగు బాసలోనివే. అతని సేనాని పండరంగని అద్దంకి శాసనంలో తరువోజ ఉన్నది. క్రీ.శ.897 చాళుక్య భీముని ధర్మవరం శాసనములో సీస పద్యము మున్నది. క్రీ.శ. 930 రెండవ యుద్ధమల్లు బెజవాడ శాసనములో మధ్యాక్క ఉన్నది. క్రీ.శ.10వ శతాబ్దము గంగాధర శాసనమున కందపద్యము ఉన్నది. ఉత్తమ సాహిత్య ధర్మమే కాక, ధర్మమును కూడా సంపూర్ణముగ సాహితి యందున్నది. తెలుగు జాతి.

అప్పటికింకను దేశమునందు సంస్కృత ప్రభావము మిక్కుటముగా నున్నది. ప్రజలు సంస్కృతమునకు అలవాటు పడి ఉన్నారు. కేవలము అచ్చతెనుగు దేశకవిత, అతి సరళము, కమ్మనైనది. సంస్కృత ప్రౌఢిమ అందులేదు. తెలుగు దేశము ప్రకృతి సుందరము, సౌమ్యవాతావరణ పరివృతము. తెలుగు వారు సహజముగ కళా ప్రియులు. భాషా పరిస్థితులను అవగాహనము చేసికొనిన ప్రతిభావంతులు. సంస్కృత పదములను సంస్కృత కావ్యములందలి అందములను అలంకారములను మత్తేభ శార్దూలాది కొన్ని ఛందస్సులను తెలుగు లోనికి తెచ్చుకొనిరి. సంస్కృత పద మిశ్రముతో తెలుగు భాషకొక ఔదార్యము, పుష్టి, వచ్చినవి, పద్యమునకు ఛందోబద్ధమైన సుందరాకారము వచ్చినది.



# తెలుగు పద్యం

11వ శతాబ్దము రాజమహేంద్రవర రాజ రాజనరేంద్రుని ఆస్థాన పండితుడు నన్నయ మహామేధావి. సంస్కృత శబ్దములను తెలుగున వాడు విధానము నిర్ణయించినాడు. ఆంధ్ర శబ్ద చింతామణి అను వ్యాకరణము. తెలుగున వ్రాసినాడు. కవితా లక్షణములను నిర్దేశించినాడు. సంస్కృత కావ్య లక్షణములను గ్రహించినాడు. ఉపదేశాత్మకము, ఉదాత్తము అయిన కథాసందర్భముతో (కురువీరుల చరిత్ర) సమగ్రమగు రసవత్కావ్యము ఆంధ్ర మహాభారతము రచించినాడు. ఆంధ్ర భాషకు వాగను శాసనుడైనాడు. ఈ కావ్యమే ఈనాటివరకు తెలుగు కావ్యములకు ఒరవడి.

నన్నయగారి సమగ్ర సుందర రసవత్కావ్య సృష్టి యగు ఆంధ్ర భారతము ఆంధ్ర సాహిత్యము అత్యున్నత స్థితికి వచ్చినది, నిరాటంకముగ గంగా ప్రవాహమువలె సాగినది. ఆనాటి నుండి నేటివరకు ఆంధ్ర వాఙ్మయమును స్థూలముగ మూడు యుగములుగ భాషా విశారదులు విభజించి చెప్పిరి. 1. పురాణ యుగము, 2. ప్రబంధ యుగము, 3. ఆధునిక యుగము.

**పురాణ యుగము:** 11 నుండి 15వ శతాబ్దము వరకు ఇందు మహాభారత కర్తలు నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు కవిత్రయము, ఆంధ్రనైషధ కాశీ ఖండ కర్త శ్రీనాథుడు, ఆంధ్ర భాగవతకర్త పోతనార్యుడు ముఖ్యులు. వీరి రచనలు సంస్కృత పురాణములకు కావ్యములకు, ఆంధ్రీకరణములే, అయినను స్వతంత్ర కావ్యములవలె సంస్కృత మూలములను మించిన రసవత్కావ్యములనిపించును, వీనిలో నూటికి తొంబది పాళ్ళు పద్యభాగమే. కొలదిగ వచన గ్రంథములును కలవు, రామాయణము కావ్యము, భారతము ఇతిహాసము, భాగవతము పురాణము భగవన్మహిమలు, ధీరోదాత్తులు మానవాభ్యుదయమునకు వలయు జీవన ఆదర్శ పురుషులవైన వారి చరిత్రము. సంతరించుకొనిన సార్థకత తెలుగు పద్య సంస్కృతికి పద్య సాహితి నిర్మల దర్పణము, లిందు కథా వస్తువులు, కథాకథనము ముఖ్యము. ఛందోబద్ధమైన పద్య సంప్రదాయమును వీడకుండ, ఈ కవులు భాసురములైన ఛంధశిల్ప శబ్ద శిల్పములతో వారివారి ప్రత్యేక శైలి మార్గమున రసవత్కవితను సృష్టించిన ప్రతిభావంతులు. నన్నయ నానారుచి రార్థ సూక్తి నిధి, ఆయన శైలి ప్రసన్న కథా కవితార్థయుక్తి. తిక్కన రసాభ్యుదయోల్లాసి, వీరి రచనలో తెలుగు పద్యములెక్కువ. ఎఱ్ఱనది సూక్తి వైచిత్రి. వీని నన్నిటిని ఆకళించుకొని రచనల జేసిన కవి, పరమ భావుక సార్వభౌముడు శ్రీనాథుడు. పోతనార్యుని కావ్యకళ బాలరసాలసాల నవ పల్లవ సదృశము.

కరుణ శాంత భయానక బీభత్సాది నవ రసముల కనుగుణముగ, సందర్భోచితముగ ఏ ఛందస్సును ఏ వృత్తమును వాడుట రసోత్పాదకమో ఆ మార్గమును సూచించిన రస రాజ్యాధిపతులు వారు.

**ప్రబంధయుగము :** 15 నుండి 18వ శతాబ్దము వరకు.

ఉదాత్తమైన ప్రాచీన కథ నొకదానిని వస్తువుగా గైకొని స్వకపోల కల్పనలతో వివిధ వర్ణనలతో, పాండితీ ప్రకర్షతో, శ్లేష బంధ చిత్ర కవితాది చమత్కారములతో సాగిన రచనలు మన ప్రబంధములు, ఖనిలో నుండి తీసి సాన దీర్చిన జాతి రత్నములు ప్రబంధములని రామరాజ భూషణుడు చక్కగ వర్ణించినాడు. కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నములని నిరాఘాటముగ చెప్పినాడు. కథా సంపుష్టి వర్ణన వైచిత్రి కొరకు అష్టాదశ వర్ణనా విధములతో ప్రబంధముల నింపినారు. భాష యందేమి, కవితా పటిమ యందేమి, ఆంధ్ర సాహితిని పూలపల్లకులపై నూరేగించి మహోన్నత శిఖరము లెక్కించిన మహామహులు ప్రబంధకవులు, కృష్ణరాయల ఆస్థానమున నన్న అష్టదిగ్గజ కవులలో అగ్రగణ్యుడు పెద్దన. ఆంధ్ర కవితా పితామహుడని బిరుదు ందిన ప్రతిభాశాలి.

కవిత అనగా,

"పూత మెఱుంగులుం బసరు పూప బెడంగులు రూపునట్టివా
కైతలు జగ్గు నిగ్గు నెనగావలె...

–గోస్తనీ ఫలముధ్రద్రవ గోఘృత పాయసప్రసా రాతిరస ప్రసార
రుచిర ప్రతిమంబుగ ఉండవలెను.

అని నిర్వహించి, కవితకు వెలుగు, మాధుర్యము ముఖ్యములని తన మాటను మనుచరిత్రలో చెల్లించుకొనిన కవి వతంసుడు పెద్దన.

**ఆధునిక యుగము:** 19–20 శతాబ్దములు ఆంధ్ర వాఙ్మయమున పెద్ద పెద్ద మార్పులు కానవచ్చిన కాలమది. కందుకూరి, పానుగంటి, చిలకమర్తి, శ్రీపాదవారు, వావిల కొలను వారు: జంటకవులు, తిరుపతి వెంకట కవులు, రామకృష్ణ కవులు, కొప్పరపు వారు, దేవులపల్లి సోదరులు

మున్నగు పండితోద్దండులుద్భవించిన కాలమది. ప్రపంచ పరిస్థితులు అన్యభాషా ప్రభావము ఆంధ్రముపై గూడ పడిన యుగమిది. పద్యముతో సమముగ వచన గ్రంథములు కథలు, నవలలు, విమర్శలు, వ్యాసములు, చరిత్రములు, విజ్ఞాన గ్రంథములు, వార్తా పత్రికలు వచ్చినవి.

కవితా విషయమెట్లున్నదియు చూతము, శ్రీపాద, వావిలకొలను వంటి వారు మరల పురాణానువాదములకు పూనుకొనినను తక్కిన వారు సామాజిక విషయములు, సమస్యలు, సంఘ దురాచారములపై దృష్టి, సారించి, ప్రబంధముల నాటి పాండితీ ప్రకర్షను తగ్గించి ప్రజాదరణ కావ్యములు వ్రాసినవారే-మొత్తము మీద సరళమైన భాషలో సులభశైలి పద్యములతో తెలుగు కవితను సామాన్యజనుల మధ్యకు కొని వచ్చిన ప్రతిభ తిరుపతి వెంకట కవులకు దక్కినది. వారి పాండవోద్యోగ నాటకములలోని "జెండాపై కపిరాజు", బావాయెప్పుడు వచ్చితీవు, "శ్రవణానందములోని" "ధనమా పోవును మానమా చెడును" అనిన పద్యాలు, బలిజేపల్లి వారి హరిశ్చంథ నాటకములోనివి వీధుల వెంట నేటికిని పాడుచె పోవుచురు. అనాటకముల వాంధ్రవీధులలో కొన్ని వందలసార్లు ఆడి యుందురు. పద్యమున కున్న ఆకర్షణ అట్టిది. శతకములు నూరు పద్యములు గల లఘు కావ్యములు కొల్లలుగ వచ్చినవి భక్తి, నీతి, సంఘదురాచార నిరసనము మున్నగు వస్తువులతో నిండిన రచనలివి. గాంధీ మార్గమున మంగిపూడి వారి విరుద్ధభారతము, తుమ్మల వారివి కావ్యములు వచ్చినవి, ఆశుకవిత, అష్టావధాన, శతావధానములు విరివిగా సాగినవి. సులభమైన పద్యశైలి అంతకంతకు ప్రజల నా కట్టు కొన్న దినములవి.

1925 ప్రాంతములో ఆంధ్ర కవితకు మఱియొక పెద్ద మార్పు వచ్చినది. మొదటిది భావకవిత, విద్యాధికులు పండితులైన వారే ఈ కవులు, ఆంగ్ల భాషా కవులయిన, షెల్లీ, కీట్సు, త్రోవలు అవగాహన చేసికొనినవారు. రవీంద్రుని విశ్వ భారతి ప్రభావము వీరిపై పడినది. లలిత లలిత పదములతో చక్కని కావ్యములు వ్రాసినారు. దేశభక్తి, ప్రకృతి వర్ణన కవితా వస్తువులుగా స్వీకరించిరి. సంఘసంస్కార ప్రియులు వీరు, గురజాడ వారి గీతములు, రాయప్రోలు వారి తృణకుకణము, స్నేహలత, కృష్ణశాస్త్రి గారి కృష్ణ పక్షము వేదుల వారి దీపావళి, నాయని వారి ప్రణయ యాత్ర ముద్దులొలుకు కావ్యమలు, ఎక్కువగా ఆత్మీయములైన వీరి కవితా రీతులలో భావమే ప్రధానము.

భావకవులు బోధించిన స్వేచ్ఛా వాదము విశృంఖలత్వమునకు దారి తీసినది. పద్యకవితకు మరియు ఛందో లక్షణములు కష్టమనుకొనిన యువతరము వారికీ స్వేచ్ఛ అనుకూలమైనది. భాషా శాస్త్రాధ్యయనము నందు ఆసక్తి తగ్గినది. మనకు వేయేండ్లుగా వచ్చిన సంప్రదాయ సాహిత్యము పద్యకవిత యందు గౌరవము సడలినది. కేవలము వరుస వాక్యము వ్రాసి అదే కవిత అనివారు. పద్య లక్షణములు నియమములను బంధములుగా భావించిరి, పద్యమును వడుము విరగగొట్టి చంపవలెనను నినాదములు వచ్చినవి, సమాధి గట్టదలచినారు. రచనలను రాజకీయములకు దిగజార్చినారు. ఈ వచనములకీ అభ్యుదయ కవిత, అధివాస్తవిక కవిత, విప్లవ కవిత మినీ కవిత అని ఏవేవో పేరులు పెట్టినారు.

ఎవరెన్ని పలికినను పద్మము పద్యమే. వచనము పద్యమెన్నటికిని కాదు. కవిత అనిపించుకొనదు. ఋషి కల్పురైన మన పూర్వ కవులు పద్యమునకు సువర్ణ సౌధములు నిర్మించి శాశ్వతత్వము కల్పించినారు. పద్యమెన్నటికినీ చెడదు.

వచన కవితా విజృంభణమున కెదురు నిలిచి తెలుగున పద్య కవితా ప్రచారము మరల విరివిగా సాగినది. మహోత్తమ కావ్యములవతరించినవి. మేడసాని వారు, మాడుగుల వారు, గరికపాటి వారు, నరాల వారు మున్నగు విద్వత్కవివరేణ్యులు అష్టావధానములే కాదు శతావధానములు, సహస్రావధానములు, ద్విసహస్రావధానములు అనర్గళముగా చేయుచున్నాడు. పరువైదు వర్షముల వయస్సు లేని జా మల్లికార్జునరావు వంటి బాలురు కూడా అవధానములు చేయుట చూచుచున్నాము. అవధానములన్నను, భువన విజయ కవితా ప్రదర్శనన్నను ప్రజలు పరువులు తీసి వచ్చుచున్నారు.

కవి సమ్రాట్ విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షము, దుర్భాక వారి ప్రతాప రుద్ర చరిత్ర, గడియారం వారి శివ భారతం, మధునాపంతుల వారి ఆంధ్ర పురాణము, పింగళి కాటూరి వారి సౌందర్యనందము, జాషువా, అంద్యలవారి కవితలు, ద్వివేదుల భూతపురి, బలిజవారి వారిత్రక కావ్యములు, ఇంకను ఈ కోవలో ఎన్నెన్నో నవ్య ప్రబంధములు, దేశికాచార్య గారి జక్కన చరిత్ర, శిష్ఠా వారి జనీలు, కొండేపూడి వారి హనుమత్ర్పబంధము, కలపర్తి వారి సులోచన, వేమూరి వారి స్వాతంత్ర్య సిద్ధి, నండూరి వారి ఆలోచన వంటి రచనలు వచ్చినవి. వేయి వసంతాల సౌరభము, వేయి శరత్తుల వెలుగు సంతరించుకొనిన తెలుగు పద్య కవితా వారసత్వమీ సాహిత్య సృష్టి,

పద్య కవితకు ఇంతటి వైశిష్టమెట్లు లభించినది. ఇందులకు బలమైన కారణములే ఉన్నవి.

1. తెలుగు అత్యంత మధురమైన భాష, ఇతర భాషల వారి దీనిని కొని యాడిరి, కర్నాట ప్రభువు శ్రీ కృష్ణ దేవరాయలు "దేశ భాషందు తెలుగు లెస్స" అన్నారు. తమిళుల గాన విద్యకు తెలుగు ఆధారమైనది. విదేశీయులు తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నారు.
2. తెలుగు పద్య లక్షణములు, గణములు, పాదపాదమునకు గణముల కూర్పు, అలక్షరమైత్రి, స్వరమైత్రి గల యతి ప్రాసలు తెలుగు పద్యమునకు ఒక గమకమును, లయను ఇచ్చినవి, పద్యమును రాగ సరణిలో శ్రపణ పేయముగ పఠించవచ్చును. పవనమునకు సౌలభ్యము లేదు. పద్యములో ఒక పాదమును తరువాత పాదముతో, ఒకే పదముతో గాని, సమాసముతో గాని కలిపి వ్రాయవచ్చును. పద్యమునందిది యొక అందము. ఈ అందములు ఏ యితర భాషల కవితలందును కానరావు,
3. పద్యమునందు యతి ప్రాసలు గల పదమైత్రి యుండుటచే ధారణకు చాల అనుకూలము. ఇందుచేతనే ఎన్నో పద్యములు తెలుగు వారికి కంఠస్థములై యుండును. ఒక కావ్యము కావ్యమే పూర్తిగా కంఠస్థము చేసి అప్పజెప్పువారున్నారు. అవధాన విద్యకు ఆధారమైనది ఈ ధారణా సౌలభ్యమే, వచనమును ఏ ఒక రెండు పుటలోగాని కంఠస్థము చేసి అప్పజెప్పువారు లేదు. అప్పజెప్పినను శ్రవణపేయముకాదు.
4. పద్యములోని భావము చటుక్కున శ్రోతల హృదయమునకు హత్తుకొనును. చదువవలసిన తీరులో రాగయుక్తముగ పద్యమును చదివినచో ప్రజలు విరగబడి వచ్చి విందురు.
5. ఛందో బద్ధమైన పద్యములకు మన సంఘములో ఒక మర్యాదా, గౌరవమూ ఉన్నవి. ప్రశంసలు, ఆశీస్సులు పద్యాలలోనే

తెలుగు పద్య ఆవిర్భానము, వికాసము స్వరూప స్వభావములు పద్యకవితా వైశిష్ట్యము ప్రాఙ్నన్నయ యుగము నుండి స్థూలముగ కొంత పరిశీలన జరిగినది. పురాణ ప్రబంధముల పద్యధోరణులు గమనించితిమి.

ఏ యితర భాషాకవితలందును లేని కళా ప్రకాశము సౌందర్యము తెలుగు పద్యమునందున్నవి. ఉత్తమ సాహిత్య ధర్మమే కాక, మానవాభ్యుదయమునకు వలయు జీవన ధర్మమును కూడా సంపూర్ణముగ సంతరించుకొనిన సార్థకత తెలుగు పద్య సాహితి యందున్నది. తెలుగు-జాతి సంస్కృతికి పద్య సాహితి నిర్మల దర్పణము. ఈ పవిత్ర సంప్రదాయమును పరిరక్షించి, భవిష్యత్తున కందజేయుట ఎచ్చట నున్నను తెలుగు వారందరి కర్తవ్యము.

**కొండేపూడి సుబ్బారావు**

## తెలుగు చిత్రం నిర్మించిన తొలి నటీమణి

# దాసరి కోటిరత్నం



అందానికి అందమూ, చందానికి చంద్రమూ కల దాసరి కోటిరత్నం మలి చిత్రంతోనే చలనచిత్ర నిర్మాణం లోనికి అడుగుపెట్టింది. 1935 సంగములో కలకత్తాలోని ఆరోరా ఫిల్మ్స్ వారి స్టూడియో సహకారంతో 'సతీ అనసూయ' చిత్రాన్ని నిర్మించి, ప్రధాన భూమిక నిర్వహించింది. తొలి మహిళగా చలనచిత్ర నిర్మాణం. చేబట్టిన నటీమణి దాసరి కోటి రత్నమే! ఆమె నటించిన తొలి తెలుగు చలనచిత్రం 'సతీ సక్కు బాయి', రాజమహేంద్రవరంకు చెందిన దర్శకనిర్మాత బి.వి. రామా నందంగారు 'సక్కుబాయి' చిత్రాన్ని నిర్మిస్తూ నాటక రంగంలో విశేష ఖ్యాతిని పొందిన కోటిరత్నలను 'సక్కుబాయి' పాత్రకు ఎన్నికచేసి నటింపచేశారు. అదే ఆమె చలన చిత్ర రంగప్రవేశం .విశేషమేమంటే సినిమాల్లో స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించేవారు . కానీ సక్కుబాయి చిత్రంలో సక్కుబాయి అత్తగా రంగస్థలం పై విశేష ప్రచారం పొందిన సూరవరపు వెంకటేశ్వరులుగారు అత్త పాత్రను ధరించారు. కొన్ని వందలు నాటకరంగ వేదికపై ఆయన ఆ పాత్రను ధరించి వుంటారు . మరో విశేషమేమంటే రంగస్థలం పై దాసరి కోటిరత్నం స్త్రీల పాత్రలకన్నా పురుషుల పాత్రలనే ఎక్కువగా ధరించే వారట. లోహితాసుడు , కుశుడు ,సత్యవంతుడు, నారదుడు, కృష్ణుడు పాత్రలను పోషించేవారట. కృష్ణ తులాభారం నాటకంలో కృష్ణుడుగాను , నారదుడుగాను నటించారని , ఒక ప్రదర్శనలో కృష్ణ పాత్రను, మరొక ప్రదర్శనలో నారద పాత్రను ధరించే వారని చెబుతారు. స్త్రీ పురుష పత్రాలు రెంటిని సమాన ప్రతిభ తో నటించేవారు. ఆమె ఏ పాత్రను ధరించినా ఆ పాత్రకు రసపుష్టిని కలిగించేది. రెండు వందల నాటక ప్రదర్శనల్లో నారద పాత్రను ధరించి, రెండు వందల రజిత పతకాలను పొందిన నటీమణి, దాసరికోటిరత్నమే! ఆమె ఆ రెండు వందలపతకాల్ని మాలగా చేసి, ఆపాత్ర సందర్భంలో మెడలో నలంకరించుకునేవారట. ఓసారి నైజాం నవాబుగారి కోటలో 'సావిత్రి' నాటకాన్ని ప్రదర్శించినప్పుడు దివాన్ గారు నాటకములోని సత్యవంతుడి పాత్రను చూసి, వెండి గొడ్డలి, వెండి తాడును బహుకరిం చాడట. ఆమె నటించినంతగా ప్రతిభావంతంగా ఏ నటీమణి నటించ లేదని అంటారు. పేరుప్రఖ్యాతులను సంపాదించి, స్వంతంగా ఓ నాట్య మండలిని కూడా స్థాపించి విరివిగా నాటకాలను ప్రదర్శించిన నాటక సంస్థ యజమానురాలు కూడా దాసరి కోటి రత్నమే. పద్యపఠనం, పాట ఆలాపనం, వచనం చెప్పడంలో ఆమె సంత దంతన ధనం ప్రదర్శించేవారుం నాటకాల్లో సంపాదించిన సినిమా నిర్మాణంలో ప్రవేశించి 'అనసూయ' చిత్రాన్ని నిర్మించారు. ఆమె నటించిన ఇతర చిత్రాలు లంకా దహనం, మోహినీ భస్మాసుర, వరవిక్రయం, పాండురంగ విఠల్, పాదుకా పట్టాభిషేకం, వరూధిని, చంద్రవంక, అగ్నిపరీక్ష మొదలైనవి. దీటుగా కనిపించేవారు. సాటిలేని మేటిగా నటనలోనూ, పద్యాలు పాటలు పాడడంలోనూ, వాచికంలోనూ ప్రతిభను చూపించేవారు. ఆమె నాటకాలకు జనం విరగబడి వచ్చేవారంటే ప్రధాన కారణం అదే! సినిమా రంగంలో కూడా అనాటి నిర్మాతలు ఇలాటి ప్రతిభాశీలురైన నటీమణులనే తీసుకునేవారు. తెలుగు నటీమణులు అందచందాల రూపలావణ్యులు. ఇప్పుడలాటివారు లేకపోవడం విచారకరం. బొంబాయి నుంచీ, కేరళ నుంచీ వస్తువులను దిగుమతి చేసుకున్నట్టు స్త్రీ తారలను దిగుమతి చేసుకుంటున్నాం. ❑




రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# ఎవరు గొప్ప? (ఛాందోగ్యోపనిషత్తు నుండి)

**పూ**ర్వం అప్పుడెప్పుడో ఒకసారి ఇంద్రియాలన్నీ తమలో తాము పోట్లాడుకొనడం ప్రారంభించాయి. అవి 'నేను గొప్ప' అంటే 'నేను గొప్ప' అంటూ వాదించుకొనసాగాయి. ఆ వాదం ఎంతకీ తెగలేదు. చిట్టచివరకు అవన్నీ తమ జన్మకు కారణమైన పితృపాదుడు ప్రజాపతి వద్దకు పోయి, "పితృపాదా! మాలో ఎవరు శ్రేష్ఠులో మీరే చెప్పాలి" అని అడిగాయి.

ప్రజాపతి : "వినండి, చెబుతాను. మీలో ఏది నిష్క్రమిస్తే అసలు ఈ శరీరం పాపిష్ఠతరమూ, పరిత్యాజ్యమూ అవుతుందో అది అన్నిటికన్నా శ్రేష్ఠమైనది" అని సమాధానం చెప్పాడు. ఆ తర్వాత వాక్కు శరీరం నుండి నిష్క్రమించింది. ఒక సంవత్సరం కాలంపాటు శరీరానికి విడిగా ఉండి, అప్పుడు తిరిగి వచ్చి అడిగింది "నేను లేకుండా మీరెలా జీవించి వుండగలిగారు?"

శరీరం అవన్నీ ఆప్రశ్నకు "నీవు వెళ్లిపోవడం మూలాన మూగదానిగా ఉన్నదన్నమాటేగాని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సాగుతూ ప్రాణవంతంగా ఉన్నది. కన్నులు విశాల విశ్వాన్ని దర్శింపగలుగుతూనే వున్నాయి. చెవులు రకరకాల ధ్వనులను వింటూనే వున్నాయి. మనస్సు అంటేనే పరిపరివిధాలుగా ఆలోచిస్తూనే వున్నది. ఆరకంగా మేమంతా శరీరంతోపాటు బ్రతికే వున్నాము" అని బదులు చెప్పాయి. ఆ మాటలు విని వాక్కు తిరిగి శరీరంలో ప్రవేశించింది. తర్వాత శరీరంనుండి దృష్టి నిష్క్రమించింది. ఆసంవత్సరమంతా బయటనే వుండి తిరిగి వచ్చి మిగిలిన ఇంద్రియాలనిలా ప్రశ్నించింది : "నేను లేకుండా మీరంతా ఎలా బ్రతికి వున్నారో చెప్పండి?"

అవన్నీ – "ఓ దృష్టి! గ్రుడ్డిదై చూడటానికి నోచుకోలేని శరీరంలో మేము బ్రతికే వున్నాం అయినా, ఊపిరి ఆడుతూ ప్రాణం నిలబడే వుంది. నాలుక సాయంతో నోరు విప్పి మాట్లాడుతూనే వుంది. చెవికి అన్ని శబ్దాలూ విన్పిస్తూనే వున్నాయి. మనస్సు సాఫీగా ఆలోచిస్తూనే వుంది" అని చెప్పాయి. అలా చెప్పడంతో మారు మాటాడకుండా దృష్టి శక్తి మళ్ళీ శరీరం లోపల ప్రవేశించింది.

పిమ్మట శ్రవణశక్తి శరీరాన్ని విడిచిపెట్టి ఒక సంవత్సరం గడచిన తర్వాత తిరిగి వచ్చి మిగిలిన ఇంద్రియాలను అడిగింది "నేను లేకుండా మీరంతా జీవించి ఎలా ఉండగలిగారు?"

"శ్రవణేంద్రియమా! నీవు లేని శరీరం చెవిటిది అయింది. అంతే. మిగిలిన ఇంద్రియాలు పనిచేస్తూ శరీరం ప్రాణవంతంగా వుండి మిగిలిన కార్యకలాపాలన్నీ నిర్వహిస్తూనే వుంది. అటువంటి శరీరంలో మేమంతా చక్కగా బ్రతికే వున్నాం". ఆ జవాబుతో మరోమాట మాటాడకుండా శ్రవణేంద్రియం వచ్చి శరీరంలో చేరింది.

అటు తర్వాత మనస్సు నిష్క్రమించి ఒక సంవత్సరకాలం పాటు బయటనే వుంది. అప్పుడు తిరిగి వచ్చింది. "నేను లేకుండా మీరంతా ఎలా జీవించి ఉండగలిగారు? అని అడిగింది. అవన్నీ – "ఓ మనసా! పసిపిల్లలలాగా ఆలోచన మాత్రం లేకుండా అమాయికంగా శరీరం వున్నదన్నమాటే గాని శ్వాస ఆడుతూనే వుంది. మాట పలుకుతూనే వుంది. చూపు పనిచేస్తూనే వుంది. వినికిడి పోనే లేదు. అలా మేం జీవించే వున్నాము" అని చెప్పాయి. అది విని మనస్సు మామూలుగా తన స్థానంలో తాను ప్రవేశించింది.

ఆఖరుకు ప్రాణం బయటకు పోవడానికి ఉద్యమించబోతూవుంటే, అది ఇంద్రియాలతో తనకున్న బంధనాలన్నిటిని త్రెంపి పారవేసికొని పోతున్నటైంది. కట్టు కొయ్యకు పలుపులతో బంధించినప్పటికీ, ఆ పలుపులన్నిటిని త్రెంచి పారేసుకుని బయటకు పారిపోయే బలిష్ఠమైన గుఱ్ఱం వలె ప్రాణం నిష్క్రమించబోతున్నది. దాంతో ఇంద్రియాలకు భయం పట్టుకుంది. అవన్నీ ప్రాణం చుట్టూ చేరి "ప్రాణమా! నువ్వుమాత్రం బయటకు నిష్క్రమించకుండా ఇక్కడే వుండు. ప్రాణోత్క్రమణమే అయితే ఇంక ఏమి మిగులుతుంది? నువ్వు లేకపోతే మా పని సున్న అవుతుంది. నువ్వే మా అందరిలో శ్రేష్ఠుడవని మేమంతా అంగీకరిస్తున్నాం. హే భగవాన్! నువ్వు ఇక్కడనే వుండి మమ్ముల నందరినీ జీవింపజేయి" అని అభ్యర్థించాయి. ఆ తర్వాత మిగిలిన ఇంద్రియాలన్నీ ప్రాణంతో ఒక్కొక్కటి ఇలా చెప్పాయి :

వాక్కు అంది: "నేను విశిష్టమైన దాన్నే అనుకొంటే, అప్పుడు నీకన్నా విశిష్టమైన తత్త్వం ఏముంటుంది?" కన్ను అంది: "ప్రాణమా! నేను అన్నిటిని సుప్రతిష్ఠతం చేసే దాన్నే అయినట్లయితే, ఆ ప్రతిష్ఠ నీవు. "చెవి అంది: "ప్రాణమా! నేను సంపన్నురాలనైతే, ఆ సంపన్నత నీవే!" చివరకు మనస్సు అంది: "ప్రాణమా! నేను అన్నిటికీ ఆయతనాన్నే అయితే, అలాగే నువ్వూ సర్వానికి ఆయతనానివి." ఇలా అన్ని ఇంద్రియాలు ప్రాణం లేకపోతే తమ ఉనికే లేదన్నట్లు ప్రాణం యొక్క శ్రేష్ఠత్వాన్ని అంగీకరించాయి.

అందుకనే ఇవి వాక్కు చక్షువు, శ్రోత్రము, మనస్సు అనే పేర్లతో కాక ఇవన్నీ ప్రాణవంతములైతేనే పనిచేస్తాయి. కాబట్టి ఇవన్నీ ప్రాణాలనే సంకేతంతో పిలువబడుతూ వుంటాయి. అంటే ప్రాణం వినా వాటికి విడిగా విలువలేదన్నమాట. ప్రాణమే అన్నిటికన్నా గొప్ప అని తేలింది.

శ్రీ శ్రీధరబాబు



# అభిమానుల అభిమతం

అమ్మా .....
కృష్ణమ్మ దరిలో,
ముక్తేశ్వరుని నీడలో,
దుర్గమ్మ ఒడిలో,
తెలుగు తల్లి ఎదలో,
కెసిపి కాంతుల్లో,
లక్ష్మణ దత్తు అడుగుజాడల్లో,
కవితా దత్తు సంరక్షణలో,
శివానీ దత్తు చిరునవ్వుల్లో
మీరు
పదికాలాలు పదిలంగా వుంటూ,
పదిమందికీ వెలుగులు పంచుతూ,
వెయ్యేళ్ళు వర్ధిల్లాలి.
మా కృతజ్ఞతలు మీకు దైవాశీస్సులు కావాలి !
మీ చల్లని చూపులు మాకు దీవెనలు కావాలి !!

డా. వి.ఎల్. ఇందిరా దత్తు గారికి
జన్మదిన శుభాకాంక్షలతో... (14-09-2026)

– పి.వి. సాయి, హైదరాబాదు


SL
Sai Lalitha®
annam brahma
CATERING SERVICES
SOUTH INDIAN VEGETARIAN FOOD
SERVING FOOD • SERVING SOULS
SINCE 1996
30 Years of Trust, Tradition & Taste in Every Celebration
TRADITIONAL • AUTHENTIC • HYGIENIC • DELICIOUS
OUTDOOR CATERING FOR FUNCTIONS FROM 100 GUESTS ONWARDS
30 YEARS IN FOOD INDUSTRY
EXPERIENCED TEAM
PURE VEGETARIAN
TRADITIONAL RECIPES
QUALITY ASSURED
For Every Occasion...
WEDDINGS • UPANAYANAM
SEEMANTHAM • BIRTHDAYS
ANNIVERSARIES • CORPORATE EVENTS
& ALL FAMILY FUNCTIONS
+91 93810 27947
www.vivahabojanam.com
ssvivahaseva@gmail.com
CHENNAI & SURROUNDING AREAS

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
Registered with Registrar of Newspapers of India RNI No. 67369/97
September 2026
PERIODICAL POST

